విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 | సంచిక : 265 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 14 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# జగన్ కదిలితే.. జనాలకు నరకమే

- రాజకీయ ముసుగులో నేరాలు చేస్తున్నారు
- ఫ్యాక్షన్ మనస్తత్వంతోనే హెరిటేజ్‌పై ఆరోపణలు
- నల్లమలసాగర్ ప్రాజెక్టుకు తెలంగాణ అభ్యంతరం సరికాదు
- జనాభా నిర్వహణపై ఈ సమావేశాల్లోనే పాలసీ
- శాసనభలో సీఎం చంద్రబాబు

అమరావతి: 'రాజకీయం ముసుగులో నేతలే నేరాలు చేస్తే ఎలా' అని వైకాపా అధినేత జగన్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. జగన్ రోడ్డుపైకి వస్తున్నారంటే ఏం జరుగుతుందోననే భయం ప్రజల్లో నెలకొంటోందని, ఎక్కడికి వెళ్లినా దౌర్జన్యం, రోడ్డంతా దిగ్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన విజయవాడ నుంచి గుంటూరుకు వెళ్లేందుకు ఆరు గంటలా? ఆ సమయంలో ప్రయాణికులంతా నరకం అనుభవించాలా అని నిలదీశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో శుక్రవారం సీఎం ప్రసంగించారు. 'కల్తీ నెయ్యి సరఫరా చేసిందే కాక ఆ వివాదంలోకి హెరిటేజ్ సంస్థను తీసుకొచ్చారు. తిరుమల లడ్డూ కల్తీకి హెరిటేజ్‌కు ఏం సంబంధం? ప్రభుత్వం నుంచి ఆ సంస్థ ఒక్క పైసా అడగలేదు. పత్రిక ఉంది కదా అని పెద్ద హెడ్‌లైన్లు పెడుతున్నారు. బ్రాండ్ దెబ్బతీస్తే హెరిటేజ్‌కు నష్టం వస్తుందనేది వాళ్ల భావన. వాళ్లు చేసిన నేరం నుంచి తప్పించుకోవడానికి ఇతరులపై నెట్టేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. గతంలో రాయలసీమ ఫ్యాక్షన్‌లో ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బ తీసేందుకు చీనీ చెట్లనే నరికేసేవారు. ఇప్పుడూ అలాంటి



వ్యవహారాన్నే వైకాపా వారు నడిపిస్తున్నారు. రౌడీ అనేవాడు ఈ రాష్ట్రంలో ఉండడానికి వీల్లేదు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం' అని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగిస్తుండగా.. వైకాపా సభ్యులు కాగితాలు చించి ఆయనపై వేసి, అవమానించారని సీఎం ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో ఈ అసెంబ్లీ బూతులకు నమూనాగా ఉండేది. పాలకులు అసెంబ్లీలో అవమానించిన తీరుకు తనతోపాటు ఆ ఐదేళ్లలో ఎంతో మంది కన్నీళ్లు పెట్టుకున్నారని గుర్తు చేశారు.

గోదావరి జలాల్ని రెండు రాష్ట్రాలూ వినియోగించుకోవాలి

'ఏటా 3,500 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. అందులో 200 టీఎంసీల

మిగతా2లో



## పార్లమెంటులో మాటల యుద్ధానికి విరామం

### ముగిసిన బడ్జెట్ సమావేశాల తొలి దశ

దిల్లీ: అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం, మాజీ సైన్యాధ్యక్షుడు ఎం.ఎం.నరవణె పుస్తకం సహా పలు అంశాలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్ర విమర్శలు, ప్రతి విమర్శలతో వాడీవేడిగా సాగిన పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తొలి దశ శుక్రవారంతో ముగిసింది. మలి దశ సమావేశాలు వచ్చే నెల 9న ప్రారంభం కానున్నాయి. ఈలోగా- కేంద్ర బడ్జెట్‌లో వివిధ మంత్రిత్వ శాఖలకు దక్కిన కేటాయింపులను పార్లమెంటరీ స్థాయీసంఘాలు పరిశీలిస్తాయి. బడ్జెట్ సమావేశాల తొలి దశ చివరి రోజు కూడా విపక్ష సభ్యుల నినాదాలతో లోక్‌సభ దద్దరిల్లింది. శుక్రవారం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురీ పేరు ఉన్నందున ఆయన రాజీనామా చేయాల్సిందేననీ డిమాండ్ చేశారు.

మిగతా2లో



## హసీనా అప్పగింతను కోరతాం

భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ను తమకు అప్పగించాలని కోరతామని బీఎన్‌పీ వెల్లడించింది. "ఇది రెండు దేశాల విదేశాంగ శాఖలు నిర్ణయించాల్సిన అంశం. విచారణ ఎదుర్కొనేందుకు ఆమెను స్వదేశానికి పంపించాలని భారత ప్రభుత్వాన్ని కోరతాం" అని ఆ పార్టీ ప్రతినిధి సలాహుద్దీన్ అహ్మద్ అన్నారు. విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా.. 2024 ఆగస్టు నుంచి భారత్‌లోనే ఉంటున్నారు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే కేసుల్లో స్వదేశంలోని 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' (×జు) ఆమెకు మరణ శిక్ష విధించింది. వేరే ఇతర కేసుల్లోనూ ఆమెకు శిక్షలు పడ్డాయి. గతంలోనూ ఆమె అప్పగింతకు సంబంధించి అభ్యర్థనలు వచ్చాయి. హసీనాను

మిగతా2లో



## మాటిచ్చాం.. నిలబెట్టుకుంటున్నాం

- పింఛను మొత్తం పెంచుతామన్న హామీ అమలు
- మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- రైతులకు గత ప్రభుత్వ బకాయిల చెల్లింపు
- ప్రభుత్వ విజయాలను వివరించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చలో వెల్లడి
- వైకాపా ఎమ్మెల్యేల తీరు.. హనుమంతుడి ముందు కుప్పిగంతులని విమర్శ

: వైకాపా ప్రభుత్వ అరాచక, అసమర్థ, అవినీతి పాలన వల్ల ఎదురైన పెనుసవాళ్లు, ఇతర సమస్యలను సీఎం చంద్రబాబు పరిపాలన అనుభవంతో అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుని ముందుకెళుతున్నామని చెప్పారు. వికసిత్ భారత్‌లో భాగంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా గవర్నర్ ప్రసంగం సాగిందన్నారు. ఎంతో ఉన్నతమైన గవర్నర్ ప్రసంగానికి అడ్డంకులు సృష్టిస్తూ వైకాపా ఎమ్మెల్యేలు చేసిన రభస హనుమంతుడి ముందు కుప్పిగంతులు వేసినట్లుగా ఉందని విమర్శించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పవన్ కల్యాణ్ శాసనసభలో శుక్రవారం మాట్లాడారు. తన ప్రసంగంలో ప్రముఖ కవుల కవితలు, మాజీ ప్రధాని వాజ్‌పేయీ మాటల్ని ప్రస్తావించారు. గవర్నర్ ప్రసంగం చాలా ప్రేరణ కలిగించింది.

మిగతా2లో

## సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తా

- ప్రధాని మోదీ ఉద్ఘాటన
- చారిత్రక సౌత్‌బ్లాక్ నుంచి నూతన భవనంలోకి మారిన పీఎంవో

దిల్లీ: కొత్తగా నిర్మించిన ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో)- 'సేవా తీర్థ్'లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తానని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణంలో సేవా తీర్థ్‌తో పాటు కేంద్ర సచివాలయ భవనాలైన కర్తవ్య భవన్-1, కర్తవ్య భవన్-2ల ప్రారంభం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రగతికి,

మిగతా2లో



## ఆ నమ్మకంతోనే బతుకుతున్నా

### డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు




- డీకే శివకుమార్ సీఎం కావాలని ఆయన మద్దతుదారుల ఆకాంక్ష
- కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందని డీకే వ్యాఖ్య
- అధికార మార్పిడిపై హైకమాండ్ పిలుపు గురించి తనకు తెలియదన్న డీకే
- పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ

మిగతా2లో

## ఐటీ ఉద్యోగులకు ఏఐ సెగ.. నేర్చుకోకుంటే ఇంటికే!

- ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ఉద్యోగాల కోత
- ఈ ఏడాది 10,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం
- ఏఐ నైపుణ్యాలు నేర్చుకోవాలని ఉద్యోగులకు టెక్ కంపెనీల హెచ్చరిక
- గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లలో మాత్రం కొనసాగుతున్న నియామకాలు
- ఫ్రెషర్ల నియామకాల్లో నైపుణ్యాలకే పెద్దపీట

మిగతా2లో






## లోకేశ్ ఇంట కూటమి నేతల సందడి..

### చిత్తూరు, అనకాపల్లి నేతలకు ఆతిథ్యం

- మంత్రి లోకేశ్ సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం
- చిత్తూరు, అనకాపల్లి కూటమి నేతలకు ఆత్మీయ విందు
- కుటుంబ సభ్యులతో కలిసి హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు
- వినతుల పురోగతిపై ప్రజాప్రతినిధులకు నివేదికల అందజేత
- మహిళలకు కానుకగా మంగళగిరి పట్టుచీరలు

మిగతా2లో

# జగన్ కదిలితే.. జనాలకు నరకమే

-మొదటిపేజీ తరువాయి

నీటిని నల్లమలసాగర్‌కు తరలిస్తాం. దీనిపై తెలంగాణ అభ్యంతరం చెప్పటం సరికాదు. రెండు తెలుగు రాష్ట్రాలూ నీటిని సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైతే ఈ అంశంపై సంప్రదింపుల ద్వారా ఓ నిర్ణయానికి రావచ్చు. ఒకటి రెండు అంశాల పరిష్కారం కోసమైతే కూర్చుని మాట్లాడుకుందామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రతిపాదించారు. వచ్చే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులనూ పూర్తి చేస్తాం. పోలవరం- వంశధారను అనుసంధానిస్తాం. హంద్రీనీవా కాల్వలను పూర్తి చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకువెళ్లాం. రాయచోటికి నీరు తీసుకువెళ్తాం. గాలేరు-నగరి ద్వారా వచ్చే ఏడాది కడపకూ నీళ్లిస్తాం. ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఎమ్మెల్యేలు ప్రత్యక్షంగా చూడాలి. గత పాలకులు రాజకీయ కక్షతో పోలవరాన్ని గోదాట్లోనే ముంచేశారు. డయాఫ్రం వాల్ ధ్వంసం చేస్తే ఇప్పుడు రూ.వెయ్యి కోట్లతో మళ్లీ దాన్ని నిర్మిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌లోగా జాతికి అంకితం చేస్తాం' అని పేర్కొన్నారు.

**సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా..**

'జనాభా నిర్వహణపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే పాలసీ తెస్తాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఆదుకున్న కేంద్రానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా సుపరిపాలన అందిస్తున్నాం. ఎన్టీఆర్ భరోసా కింద నెలకు రూ.2,750 కోట్లు పింఛన్లుగా అందిస్తున్నాం. తల్లికి వందనం ద్వారా కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం కింద ఇప్పటి వరకు 43.5 కోట్ల ప్రయాణాలు చేశారు. దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లను అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి ఏపీ, మహారాష్ట్ర ఆదర్శంగా నిలవనున్నాయి' అని పేర్కొన్నారు.

**సంపద ఉంటేనే పంచగలం**

'ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో సంపద సృష్టి జరుగుతోంది. రోడ్లు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలను ఈ విధానంలోనే నిర్మిస్తున్నారు. పీపీపీలో ప్రాజెక్టు నిర్మించి, నిర్వహిస్తారు. నిర్దిష్ట కాలపరిమితి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. సంపద ఉంటేనే దాన్ని పంచగలం. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయగలం. పీ4తో భవిష్యత్తులో మంచి ఫలితాలొస్తాయి. పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని రాష్ట్రంలో చేపట్టాం. రూ.30 వేల కోట్లు ప్రభుత్వ నిధులు, రూ.70 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమలో ఉద్యాన హబ్ అభివృద్ధి చేస్తాం. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో డబ్బులు చెల్లించాం. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు నివారించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి ఘటననూ ఆడిట్ చేయిస్తాం' అని తెలిపారు.

**భూ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు**

'వైకాపా ప్రభుత్వంలో భూముల రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. వారికి భూములు ఇవ్వకపోతే నిషిద్ధ జాబితా (22ఎ)లో పెట్టేశారు. చట్టాలు చేసే స్థానంలో ఉండే అప్పటి ముఖ్యమంత్రే చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేస్తే ఎవరికి చెప్పుకోవాలి? తాడేపల్లి ప్యాలెస్ సమీపంలో హెలిప్యాడ్ కోసం పక్కనే ఉన్న భూమిని అడిగారు. ఆ భూమి ఇవ్వకపోవడంతో బలవంతంగా 22ఏలో పెట్టేశారు. మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు తగలబెట్టారు' అని ధ్వజమెత్తారు. రెవెన్యూ రికార్డులన్నీ ప్రక్షాళన చేసి రాజముద్రతో పాస్ పుస్తకాలు ఇస్తున్నామన్నారు. 'మద్యం వ్యవహారంలోనూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టారు. రూ.3,200 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారు. దానిపై కోర్టులూ ఆగ్రహం వ్యక్తం చేశాయి' అని సీఎం చెప్పారు.

**భూమి, ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే ఉద్యోగాలు ఎలా వస్తాయి?**

'భూమి, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు, ఉద్యోగాలు ఎలా వస్తాయి? ప్రముఖ పరిశ్రమలకు భూములిస్తుంటే కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేలా ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25.6% మనకే దక్కాయంటే ఏపీ బ్రాండ్ విలువేంటో అందరూ అర్థం చేసుకోవాలి. విశాఖలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ పరిశ్రమలు వస్తున్నాయి. అనకాపల్లిలో ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నారు. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ రూ.70 వేల కోట్లతో రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. భాగస్వామ్య సదస్సులో రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులకు 610 ఒప్పందాలు చేసుకున్నాం. మొత్తంగా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను రూ.4 వేల కోట్లతో అనుసంధానిస్తున్నాం' అని వెల్లడించారు.

# మాటిచ్చాం.. నిలబెట్టుకుంటున్నాం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసింది. సీఎం చంద్రబాబు నాయకత్వం, ఆయన అనుభవంతో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దివ్యాంగుల పింఛనును రూ.3 వేల నుంచి రూ.6 వేలు చేశాం. మంచం మీద నుంచి లేవలేని దివ్యాంగులకు రూ.6 వేల నుంచి రూ.15 వేలకు పెంచాం. సామాజిక పింఛను రూ.3 వేల నుంచి రూ.4 వేలు చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా 63.25 లక్షల మందికి ప్రతి నెలా రూ.2,738 కోట్లు అందిస్తున్నాం. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్లు వారి తల్లుల ఖాతాల్లో జమ చేశాం. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం' అని చెప్పారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టినందుకు మంత్రి లోకేశ్‌కు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

**అన్నం పెట్టే రైతుకు రూ.1,674 కోట్లు బకాయి పెట్టిన వైకాపా**

'అందరికీ అన్నం పెట్టే రైతాంగాన్ని గత ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెట్టింది. రైతుల నుంచి కొన్న ధాన్యానికి రూ.1,674 కోట్లు చెల్లించకుండా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ బకాయిలన్నీ చెల్లించింది. గత ఏడాది 7.37 లక్షల మంది రైతుల నుంచి కొన్న ధాన్యానికి 24 గంటల్లోనే రూ.10,650 కోట్లు చెల్లించాం. మరో 53 వేల మందికి 48 గంటల్లో దాదాపు రూ.వెయ్యి కోట్లు చెల్లింపులు చేశాం' అని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. 'భూమిని ఫలాలుగా, పంటగా మార్చే ప్రావీణ్యం కలిగిన రైతులు ధైర్యం కోల్పోవాల్సిన అవసరం లేదు. మట్టిలో కస్తూరి తీసే మనిషికి జీవన పరిమళాల కొరత లేదు. మీ కోసం ఈ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది' అని హామీ ఇచ్చారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగించిన తర్వాత కరచాలనం చేసి అభినందిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్

**ఉద్యోగుల ఆవేదన తెలిసే 10 వేల మందికి పదోన్నతులు**

'ఉద్యోగుల ఆవేదన మాకు తెలుసు. అందుకే సీఎం చంద్రబాబు నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖలో 10 వేల మందికి ఏకకాలంలో పదోన్నతులు ఇచ్చాం. మరో 77 మందికి జిల్లా పరిషత్ సీఈవోలుగా ప్రమోషన్లు కల్పించాం. 77 డీడీవో కార్యాలయాలు ప్రారంభించాం. అంధ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక మొదలుకొని ఇటీవల పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువత, ఉదయగిరి నియోజకవర్గంలో పాఠశాల విద్యార్థుల వరకు గ్రామానికి, స్కూల్‌కి వెళ్లేందుకు రోడ్లు కావాలని అడిగారు. గర్భిణులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కొండలు, గుట్టలు దాటుకుని వెళుతున్న పరిస్థితుల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎం జన్‌మన్, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 'అడవితల్లి' బాట పేరుతో 625 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ రూ.1,005 కోట్లతో 1,069 కిలోమీటర్ల రహదారులు నిర్మిస్తున్నాం. 17 కుటుంబాలున్న మారుమూల గిరిజన గ్రామానికి రూ.కోటికి పైగా వెచ్చించి 9.6 కి.మీ. మేర విద్యుత్తు స్తంభాలు వేసి, కరెంటు ఇచ్చాం. 'ఎన్నాళ్లకు మా అతిథిగా వచ్చావు.. ఈ శిథిల కుటీరానికి ఇంత వెలుతురు తెచ్చావు'

అనే గిరిజన ప్రజల భావన నాకు తెలిసింది అని పవన్ కవితాత్మకంగా చెప్పారు.

**రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టినా గుక్కెడు నీళ్లివ్వలేకపోయారు**

'జలజీవన్ మిషన్ కింద రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.27 వేల కోట్లు మంజూరు చేస్తే గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.4 వేల కోట్లే ఖర్చు చేసింది. అందులోనూ కేంద్రం వాటా రూ.2 వేల కోట్లు. ఈ నిధులతోనూ పైపులైన్లు వేయడం తప్ప గ్రామాలకు గుక్కెడు నీళ్లివ్వలేకపోయారు. ఈ ప్రభుత్వం వచ్చాక కేంద్ర సహకారంతో పథకం గడువు పెంచుకోగలిగాం. రూ1,242 కోట్లతో ఉద్దానం, డోన్, పులివెందులలో తాగునీటి పథకాల పనులు మే నాటికి పూర్తి చేయనున్నాం. రూ.7,910 కోట్లతో చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాల్లో తాగునీటి పథకాలను వచ్చే రెండేళ్లలో పూర్తి చేయనున్నాం. వీటి ద్వారా వచ్చే 30 ఏళ్లలో 1.20 కోట్ల మంది ప్రజల రక్షిత మంచినీటి అవసరాలు తీరనున్నాయి. ఇంకో రూ.9,160 కోట్లతో మల్టీ విలేజ్ స్కీం అమలు చేయనున్నాం' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు.

# ఐటీ ఉద్యోగులకు ఏఐ సెగ..
# నేర్చుకోకుంటే ఇంటికే!

భారత ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పెను మార్పులకు కారణమవుతోంది. ఒకవైపు ఉత్పాదకత పెంచడానికి కంపెనీలు ఏఐని వేగంగా అమలు చేస్తుంటే, మరోవైపు సంప్రదాయ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతోంది. ఈ ఏడాది ఏఐ ఆటోమేషన్ కారణంగా 10,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని తాజా అంచనాలు హెచ్చరిస్తున్నాయి.ఏఐ టూల్స్ వాడకంపై నైపుణ్యం పెంచుకోవాలని, లేదంటే పోటీలో వెనుకబడిపోతారని గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు తమ ఉద్యోగులకు స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నాయి. పనితీరు సమీక్షల్లో కూడా ఏఐ వినియోగాన్ని ఒక కొలమానంగా పరిగణిస్తున్నట్టు తెలుస్తోంది. ఏఐ వల్ల ఉత్పాదకత పెరుగుతుండటంతో, తక్కువ మంది సిబ్బందితో ఎక్కువ పని చేయగలుగుతున్నామని కంపెనీలు భావిస్తున్నాయి. గతేడాది కూడా టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలు వేల మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. ఈ ప్రభావం ఫ్రెషర్ల నియామకాలపైనా పడింది. ఒకప్పుడు భారీగా ఉద్యోగాలిచ్చిన కంపెనీలు, ఇప్పుడు ఏఐ, క్లౌడ్, డేటా అనలిటిక్స్ వంటి ప్రత్యేక నైపుణ్యాలు ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) మాత్రం కొంత ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జీసీసీలు దాదాపు 1.2 లక్షల నుంచి 1.4 లక్షల మందిని నియమించుకునే అవకాశం ఉంది.మొత్తంమీద, ఐటీ రంగంలో నిలదొక్కుకోవాలంటే కొత్త టెక్నాలజీలను నేర్చుకోవడం తప్పనిసరి అని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. కేవలం డిగ్రీ ఉంటే సరిపోదని, ఏఐ ఆధారిత నైపుణ్యాలు పెంచుకున్న వారికే భవిష్యత్తు ఉంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఆ నమ్మకంతోనే బతుకుతున్నా

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఎప్పుడూ నమ్మకంతోనే జీవిస్తున్నానని, కష్టపడి పనిచేస్తే ఫలితం తప్పకుండా వస్తుందని అన్నారు. "శ్రమ ఎక్కడ ఉంటుందో, అక్కడ ప్రతిఫలం ఉంటుంది. భక్తి ఎక్కడ ఉంటుందో, అక్కడ భగవంతుడు ఉంటాడు," అని ఆయన శుక్రవారం వ్యాఖ్యానించారు.ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో, ఆ తర్వాత టిప్టూరులో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ విధంగా స్పందించారు. ఢిల్లీ పర్యటన తర్వాత మీలో విశ్వాసం పెరిగిందా అని ప్రశ్నించగా, పై వ్యాఖ్యలనే పునరుద్ఘాటించారు. అధికార మార్పిడిపై చర్చించేందుకు ఫిబ్రవరి 17న మిమ్మల్ని, సీఎం సిద్ధరామయ్యను హైకమాండ్ ఢిల్లీకి పిలిచిందనే వార్తలపై స్పందిస్తూ.. "ఆ విషయం నాకు తెలియదు. కాలమే సమాధానం చెబుతుంది," అని అన్నారు. ఇదే అంశంపై హోంమంత్రి పరమేశ్వర అధిష్ఠానాన్ని వివరణ కోరతానన్న దానిపై "ఆయనకు మంచి జరగాలి" అని బదులిచ్చారు.కొందరు ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనకు వెళు_న్నారనే దానిపై నివేదిక కోరారా అని అడగ్గా, తాను ఎలాంటి నివేదిక కోరలేదని, ఆ సమాచారం తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదని స్పష్టం చేశారు. "నేను పార్టీకి క్రమశిక్షణ గల సైనికుడిని. పార్టీ ఏది చెబితే దానికి కట్టుబడి ఉంటాను. మిగతా ఏ విషయాల్లోనూ జోక్యం చేసుకోను. ఎమ్మెల్యేలు ఏమైనా సమస్యలు లేవనెత్తితే, వాటిని హైకమాండ్ నాయకులు, ముఖ్యమంత్రి చూసుకుంటారు," అని వివరించారు.

ఇదిలా ఉండగా, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలనేది తమ ఆకాంక్ష అని, రాష్ట్ర ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఇదే కోరుకుంటున్నారని ఆయన మద్దతుదారు, ఎమ్మెల్సీ చెన్నరాజ్ హట్టిహోళి పేర్కొనడం గమనార్హం.

# సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తా

-మొదటిపేజీ తరువాయి

పౌరులే కేంద్రంగా పరిపాలన సాగించాలన్న తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇవి నిదర్శనాలని వ్యాఖ్యానించారు. దిల్లీలో సేవా తీర్థ్ సముదాయాన్ని ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సముదాయంలో కొత్త పీఎంవో (సేవా తీర్థ్)తో పాటు కర్తవ్య భవన్-1, కర్తవ్య భవన్-2, జాతీయ భద్రతామండలి సచివాలయం ఉంటాయి. "దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకే సేవాతీర్థ్, కర్తవ్య భవన్‌లను నిర్మించాం. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు 140 కోట్ల మంది భారతీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి పునాదుల్లా పనిచేస్తాయి. బ్రిటిష్ హయాం నాటి భవనాలను చూస్తుంటే బానిసత్వపు ఆనవాళ్లు గుర్తుకొస్తాయి. సేవా తీర్థ్, కర్తవ్య భవన్‌లు మన స్వేచ్ఛ, స్వయంపాలనకు సంకేతాలు. వీటిని జాతికి అంకితమిస్తున్నాం. 1921 నుంచీ దేశంలో అధికార కేంద్రాలుగా ఉన్న చారిత్రక సౌత్‌బ్లాక్, నార్త్‌బ్లాక్ భవనాలను మ్యూజియంగా మారుస్తాం" అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.100 ప్రత్యేక నాణాన్ని విడుదల చేశారు. బ్రిటిష్ హయాం నాటి సచివాలయ భవనంలోని తన కార్యాలయమైన సౌత్ బ్లాక్‌లో ప్రధాని మోదీ చివరి కేబినెట్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం పీఎంవోను సేవా తీర్థ్‌కు మార్చారు. సేవాతీర్థ్ ప్రారంభం అనంతరం- పలు కీలక నిర్ణయాలకు సంబంధించిన దస్త్రాలపై మోదీ సంతకాలు చేశారు. రోడ్డుప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించే లక్ష్యంతో తీసుకువచ్చిన 'పీఎం-రాహత్' వాటిలో ఒకటి. ఈ పథకం కింద.. రోడ్డుప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల మేర నగదురహిత చికిత్స అందనుంది. లఖ్‌పతి దీదీల సంఖ్యను 2029 మార్చి నాటికి రెట్టింపు చేసేలా (6 కోట్లకు పెంచేలా) కేంద్రం లక్ష్యం విధించుకున్న దస్త్రంపైనా ప్రధాని సంతకం చేశారు.

# పార్లమెంటులో మాటల యుద్ధానికి విరామం

-మొదటిపేజీ తరువాయి

గందరగోళం మధ్య సభ తొలుత గంటసేపు, అనంతరం మార్చి 9 వరకు వాయిదా పడింది. రాజ్యసభను కూడా శుక్రవారం శూన్యగంట అనంతరం అదే తేదీకి వాయిదా వేశారు. బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2న ముగుస్తాయి.

**సస్పెన్షన్ వేటు.. స్పీకర్‌పై నోటీసు**

గత నెల 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంతో బడ్జెట్ సమావేశాల తొలి దశ ప్రారంభమైంది. 2020 నాటి భారత్-చైనా ఘర్షణకు సంబంధించి ఎం.ఎం.నరవణె తన పుస్తకంలో చేసిన వ్యాఖ్యలను లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ సభలో ప్రస్తావించేందుకు స్పీకర్ అనుమతించకపోవడంతో.. ఈ నెల 2 నుంచి దిగువ సభలో పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సభ పదేపదే వాయిదా పడింది. అధికారుల బల్లలపై నిల్చోవడం, పేపర్లను చింపి సభాపతివైపు విసరడం వంటి అనుచిత చర్యలకు పాల్పడినందుకు ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు, ఓ సీపీఎం ఎంపీపై సస్పెన్షన్ వేటు (తొలి విడత బడ్జెట్ సమావేశాలు ముగిసేదాకా పార్లమెంటుకు రాకుండా) పడటంంతో పరిస్థితులు మరింత వేడెక్కాయి. నాటి నుంచి విపక్ష నేతలు నినాదాల ఉద్ధృతిని ఇంకా పెంచారు. పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండటంతో.. లోక్‌సభకు రావొద్దని ప్రధాని మోదీకి స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. దీంతో- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా ప్రధాని రాజ్యసభలోనే ప్రసంగించారు. స్పీకర్ పదవి నుంచి ఓం బిర్లాను తొలగించాలంటూ విపక్షాలు ఈ సమావేశాల్లో నోటీసు సమర్పించాయి. బడ్జెట్ సమావేశాల రెండో విడతలో అది సభ ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. పారిశ్రామిక సంబంధాల నియమావళిని సవరించేందుకు ఉద్దేశించిన బిల్లును తొలి విడతలో పార్లమెంటు ఆమోదించింది.

**రాహుల్‌పై వేరే తీర్మానం ప్రవేశపెట్టం: రిజిజు**

ప్రధాని మోదీ గురించి అనుచిత పదజాలంతో మాట్లాడినందుకు రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలన్న ప్రణాళికను ప్రభుత్వం పక్కనపెట్టినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. రాహుల్ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో భాజపా ఎంపీ నిశికాంత్ దుబె ఇప్పటికే 'సబ్‌స్టాంటివ్ మోషన్' కోసం నోటీసు సమర్పించడమే ఇందుకు కారణమని విలేకర్లతో మాట్లాడుతూ తెలిపారు.

# హసీనా అప్పగింతను కోరతాం

-మొదటిపేజీ తరువాయి

అప్పగించాలని బంగ్లాదేశ్ చేసిన అభ్యర్థనను పరిశీలిస్తున్నామని భారత్ ఇప్పటికే చెప్పిన సంగతి తెలిసిందే.

**బంగ్లా పీఠంపై 'డార్క్ ప్రిన్స్'.. భారత్‌తో స్నేహమా? రణమా?**

గురువారం జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎన్‌పీ విజయం సాధించింది. మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడు తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలోనే హసీనా గురించి ఆ పార్టీ స్పందించింది.

# లోకేశ్ ఇంట కూటమి నేతల సందడి..

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ రాజకీయాల్లో ఒక సరికొత్త, ఆరోగ్యకరమైన సంప్రదాయానికి శ్రీకారం చుట్టడం తెలిసిందే. కూటమిలోని ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో వ్యక్తిగత బంధాన్ని బలోపేతం చేసే దిశగా పార్లమెంటు సెగ్మెంట్ల వారీగా ఆత్మీయ విందు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా నిన్న మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం కూటమి ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో సమావేశం అయిన లోకేశ్... ఇవాళ రాత్రి ఉండవల్లిలోని తన నివాస ప్రాంగణంలో చిత్తూరు, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని కూటమి ప్రజాప్రతినిధులకు, వారి కుటుంబ సభ్యులకు ఆత్మీయ విందు ఇచ్చారు.ఈ కార్యక్రమానికి కుటుంబసభ్యులతో సహా విచ్చేసిన ప్రజాప్రతినిధులకు మంత్రి లోకేశ్ స్వయంగా ఎదురేగి ఆప్యాయంగా స్వాగతం పలికారు. వారి కుటుంబ సభ్యులను పలకరించి, పరిచయం చేసుకున్నారు. స్పీకర్, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే అనే హోదాలకు అతీతంగా అందరూ కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. సరదా సంభాషణలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ విందు కొనసాగింది. ఈ సమావేశం ఒక పిక్నిక్‌ను తలపించిందని నేతలు ఆనందం వ్యక్తం చేశారు. లోకేశ్ కేవలం ఆతిథ్యానికే పరిమితం కాకుండా, పాలనపైనా తనదైన ముద్ర చూపించారు. ఆయా ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి పనులపై గతంలో ఇచ్చిన వినతుల పురోగతిపై ఒక నివేదికను తయారు చేయించి, వారికి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు మంగళగిరి పట్టుచీరలను బహుమతిగా అందించారు.ఈ ఆత్మీయ సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గాలి భాను ప్రకాశ్, వీఎం థామస్, గురజాల జగన్ మోహన్, కె.మురళీమోహన్, పులివర్తి నాని, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. అలాగే, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ (బీజేపీ), స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, కొణతాల రామకృష్ణ (జనసేన), పంచకర్ల రమేశ్ బాబు (జనసేన), సుందరపు విజయ్ కుమార్ (జనసేన) తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. విందు పూర్తయ్యాక, అతిథులందరినీ మంత్రి లోకేశ్ స్వయంగా గేటు వద్దకు వచ్చి సాగనంపడం ఆయన వినయానికి, సంస్కారానికి నిదర్శనంగా నిలిచింది.

# రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునే పీఎం రాహత్.



**ఇంటర్నెట్ డెస్క్: , పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** ప్రధాన మంత్రి నూతన కార్యాలయ భవనం సేవా తీర్థ్ ను నేడు ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇక నూతన కార్యాలయంలో తొలి రోజున ప్రధాని ఓ కొత్త సంక్షేమ పథకాన్ని ప్రారంభించారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సాయం అందించేందుకు పీఎం-రాహత్ పేరిట ఈ పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తొలి గంటలో వైద్య సాయం అందడం అత్యవసరం. ఈ సమయాన్ని గోల్డెన్ అవర్ గా పిలుస్తారు. ఈ సమయంలో వైద్యం అందితే ప్రాణాపాయం చాలా వరకూ తగ్గిపోతుంది. ఇంతటి కీలక సమయంలో నిధుల కొరత కారణంగా వైద్యసేవల్లో జాప్యం జరగకూడదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది.
పీఎం రాహత్ పథకంలో రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల మేర తక్షణ వైద్య సాయం అందుతుంది. కాబట్టి, ఆసుపత్రి వర్గాలు వెంటనే వైద్యం ప్రారంభించాల్సి ఉంటుంది. తమ వద్ద తగిన సౌకర్యాలు లేకపోతే ఆసుపత్రి యాజమాన్యం స్వయంగా అంబులెన్స్ లో మరో ఆసుపత్రికి పంపించాలి. బాధితుడు డిశ్చార్జ్ అయ్యాక ఆసుపత్రి యాజమాన్యాలు సంబంధిత ప్యాకేజీల మేరకు బిల్లులను పోర్టల్ లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇక గ్రామీణ మహిళల స్వావలంబన కోసం గతంలో ప్రారంభించిన లఖ్‌పతీ దీదీ పథకాన్ని కేంద్రం మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నిశ్చయించింది. గ్రామీణ మహిళలు ఏటా సగటున రూ.1 లక్ష ఆదాయం సంపాదించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ దిశగా మహిళలకు పలు రంగాల్లో కేంద్రం శిక్షణ ఇస్తోంది. ఈ పథకం కింద ఇప్పటికే సుమారు 3 కోట్ల మంది మహిళలు తమ కుటుంబ సగటు ఆదాయాన్ని రూ.1 లక్ష కు పెంచుకోగలిగారు. నిర్దేశిత సమయానికంటే ముందే ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని చేరుకుంది. ఈ నేపథ్యంలో లఖ్‌పతీ దీదీల సంఖ్యను 2029 మార్చ్ నాటికి తొమ్మిది కోట్లకు చేర్చేలా కొత్త లక్ష్యాన్ని ప్రధాని నిర్దేశించి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# రూ 3.50 లక్షల కోట్ల అంచనాతో నేడు బడ్జెట్




**అమరావతి, , పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** ఏపీ ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్ కసరత్తు తుది దశకు చేరుకుంది. అసెంబ్లీలో నేడు (శనివారం) ఉదయం 11.15 గంటలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. కాగా, ఈ సారి బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేయనున్నారు. దాదాపు రూ 3.45 నుంచి 3.50 లక్షల కోట్ల వరకు అంచనాలు ఉండే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో ప్రధాన హామీ అమలు దిశగా ఈ బడ్జెట్ లో ప్రకటన ఉండనున్నట్లు సమాచారం. ఏపీ అసెంబ్లీలో ఏపీ బడ్జెట్ 2026- 27 ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఆ తరువాత వ్యవసాయ శాఖ బడ్జెట్ ను మంత్రి అచ్చెన్నాయుడు సభ ముందు ఉంచనున్నారు. ఈ సారి ప్రత్యేకంగా ఇరిగేషన్ బడ్జెట్ ను సభలో ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. దాదాపు రూ 3.50 లక్షల కోట్ల వరకు అంచనాలుగా ఉండే అవకాశం కనిపిస్తోంది. అభివృద్ధి - సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే నాలుగు అమలు చేస్తున్నారు. పెండింగ్ లో ఉన్న ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు నూ 1500 పథకం పైన బడ్జెట్ లో ప్రకటన చేస్తారని అంచనా వేస్తున్నారు. అదే విధంగా ప్రాధాన్యత రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్ తరువాత రాష్ట్రానికి కేంద్రం నుంచి పన్నుల వాట, వివిధ రంగాల్లో వచ్చే నిధుల పైన స్పష్టత రావటంతో ఏపీ ప్రభుత్వం ఈ లెక్కల ఆధారంగా బడ్జెట్ కు తుది రూపు ఇస్తోంది. ప్రాధాన్యతా రంగాలకు అధిక కేటాయింపులు కాగా సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బడ్జెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించనున్నట్లు సమాచారం.

# పెరిగిన ఎండలు, వాతావరణ శాఖ కీలక అప్‌డేట్




**ఇంటర్నెట్ డెస్క్: , పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితుల్లో గణనీయ మైన మార్పులు నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగింది. కొన్ని రోజులుగా కనిపించిన చలి ప్రభావం తగ్గుముఖం పట్టగా, పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో వేసవి ముందస్తు సంకేతాలు స్పష్టమవుతున్నాయి. రాష్ట్రం లోని పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు అధికంగా నమోదయ్యాయి. ముఖ్యంగా పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 32లీజ నుంచి 36లీజ మధ్య నమోదవుతుండగా, రాయలసీమలో తేమ శాతం తగ్గిపోవడంతో వేడి గాలుల ప్రభావం కనిపిస్తోంది. పగటి పూట ఎండలు మండుతున్నప్పటికీ, తెల్లవారుజామున ఉత్తర కోస్తా జిల్లాల్లో మోస్తరు పొగమంచు నమోదవుతోంది. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో ఉదయం వేళల్లో మసక వాతావరణం నెలకొనడంతో రహదారుల పై ప్రయాణిస్తున్న వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. విశాఖపట్నంలో గరిష్ట ఉష్ణోగ్రత 30లీజ, కనిష్టం 22లీజ గా నమోదైంది. ఏజెన్సీ ప్రాంతమైన చింతపల్లిలో కనిష్ట ఉష్ణోగ్రత 8.5లీజ వరకు పడిపోవడం గమనార్హం. ఈ నెలలో రెండు అల్పపీడనాలు ఇక బంగాళాఖాతంలో ఈ నెలలో రెండు అల్పపీడనాలు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. భూమధ్యరేఖ సమీప హిందూ మహాసముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో ఆదివారం నాటికి ఒక అల్పపీడనం ఏర్పడవచ్చని ఇండియా మెట్రోలాజికల్ డిపార్ట్మెంట్ వెల్లడించింది. అలాగే ఈ నెల 19 వ తేదీ తర్వాత నైరుతి బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం లేదా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ వాతావరణ పరిణామాల ప్రభావంతో దక్షిణ భారతదేశం లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్ దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో కూడా చెదురుమదురు వర్షాలు నమోదయ్యే అవకాశముందని తెలిపారు. ఇదే సమయంలో రాబోయే రెండు రోజుల్లో చలి తీవ్రత తాత్కాలికంగా పెరిగే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# విశాఖలో జాతీయ క్రీడా కేంద్రం కోసం సీఎం కి ఎమ్మెల్యేల విజ్ఞప్తి



**అమరావతి, పెన్ సత్తా, ఫిబ్రవరి 13**: అసెంబ్లీ సమావేశం అనంతరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసిన ప్రభుత్వ విప్ గణబాబు, తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు. ఈ సందర్భంగా వీరు విశాఖపట్నంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జాతీయ క్రీడా సంస్థ (ఎన్ఐఎస్) కేంద్రాన్ని ఏర్పాటు చేయవలసిందిగా ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు కి విజ్ఞప్తి చేయడం జరిగినది. ఈ కేంద్రం ఎన్ఐఎస్ సెంటర్ ద్వారా యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ, కోచింగ్, క్రీడా విజ్ఞాన సదుపాయాలు లభించి క్రీడా ప్రతిభ అభివృద్ధి చెందుతుంది. ఇది ఆంధ్రప్రదేశ్ యువతకు మాత్రమే కాకుండా దేశ క్రీడాభివృద్ధికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.
కాబట్టి విశాఖపట్నంలో ఎన్ఐఎస్ కేంద్రం స్థాపనకు కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి సిఫార్సు అందించవలసిందిగా కోరారు. విశాఖపట్నంలో రానున్న మెట్రో రైల్ ప్రాజెక్ట్ మౌలిక సదుపాయాల (ఇన్ఫ్రా) పై సలహాలు నివేదిస్తూ చర్చించడం జరిగినది.

## ముత్యాలమ్మపాలెం జెట్టి నిర్మాణానికి సరైనదని రిపోర్టు

- సాగరమాల ద్వారా మత్స్యకారులకు న్యాయం మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, , పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో మూడోరోజు ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగుతోంది. పెందుర్తి నియోజకవర్గంలో మినీ జెట్టి నిర్మాణం పై పంచకర్ల రమేశ్ బాబు ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. జువలదిన్నె, మచిలీపట్నం వంటి ఫిషింగ్ హర్బర్ ల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయని వివరించారు. పనులు లేని సమయంలో రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి పని కల్పించామన్నారు. విశాఖపట్నం హర్బర్ చాలా దారుణంగా తయారైందని అన్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అధునాతన పనులు చేస్తున్నామని తెలిపారు. సాగరమాల కార్యక్రమం ద్వారా మత్స్యకారులను న్యాయం చేస్తామన్నారు. కాకినాడ ఫిషింగ్ హర్బర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముత్యాలమ్మపాలెం జెట్టి నిర్మాణానికి సరైనదని ప్రభుత్వం రిపోర్టు కూడా ఇచ్చిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.


## ఇక శ్రీకాళహస్తి లోను గిరి ప్రదక్షిణ పవన్




**అమరావతి, , పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** మహా శివరాత్రి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భక్తులకు శుభవార్త అందించారు. ఆలయాల్లో పాలక మండళ్లు బాధ్యతగా ఉంటే అపచారాలు జరగవని ఆయన స్పష్టం చేశారు. గతంలో నిర్లక్ష్యం వల్ల కొన్ని ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఇక పై అలాంటి తప్పులు పునరావృతం కాకుండా కట్టుదిట్ట మైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల విశ్వాసం కాపాడటం పాలక మండళ్ల ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు. శ్రీకాళహస్తిలో ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ: తమిళనాడు లోని అరుణాచలం తరహాలోనే శ్రీకాళహస్తి ఆలయంలో ప్రతి పౌర్ణమికీ గిరి ప్రదక్షిణ నిర్వహించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో రూ.10 కోట్లతో సిమెంట్ రహదారి నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. మొత్తం 22 కిలో మీటర్ల మేర ఈ మార్గాన్ని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం మార్గం ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రతి భక్తుడికి కైలాసగిరి ప్రదక్షిణ చేసిన ఫలితం లభించాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి నిధులు: రాష్ట్రం లోని 22 ప్రధాన దేవాలయాలకు రూ.40 కోట్లతో రహదారి సదుపాయాలు కల్పిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. ఏలూరు జిల్లా లోని ఐ.ఎస్. జగన్నాథపురం లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఘాట్ రహదారి నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అలాగే కోటప్పకొండ, వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాలకు కూడా ప్రత్యేక నిధులు కేటాయించినట్లు చెప్పారు. దేవాదాయ శాఖ, పంచాయతీరాజ్ శాఖ సమన్వయంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. భక్తులకు సౌకర్యాలు పెంపొందించడం ద్వారానే ఆధ్యాత్మిక క్షేత్రాల ప్రతిష్ట పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ లో కృతిక శుక్లా

పరీక్షల సన్నద్ధత, భూ సమస్యల పై సమీక్ష.



**అమరావతి, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శుక్రవారం సాయంత్రం సచివాలయం లోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుండి రాష్ట్రం లోని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు, పరిపాలనాపర మైన భూ సమస్యల పై కీలక ఆదేశాలు జారీ చేశారు. రానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వ సేవల పై ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందించడం, ఏజెంట్ స్పేస్ కోసం అవసర మైన డాక్యుమెంట్ అప్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయడం పై చర్చించారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఎదురవుతున్న కార్యాలయాల స్థల సమస్యలు, అలాగే కోర్టు భవనాల నిర్మాణానికి అవసర మైన స్థలాలను కేటాయించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తన క్యాంపు కార్యాలయం నుండి పాల్గొని, జిల్లాలో జరుగుతున్న ప్రగతిని, పరీక్షల సన్నద్ధతను వివరించారు.

## కొండవీటి కోట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి.

పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షకావత్ కు ఎంపీ లావు విన్నపం.



**నరసరావుపేట, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** పల్నాడు జిల్లా, చిలకలూరిపేట నియోజకవర్గం లోని చారిత్రక, సంస్కృతి వైభవానికి ప్రతీకగా, పర్యటకానికి అత్యంత వీలుగా ఉన్న కొండవీటి కోట వారసత్వ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ పథకం స్వదేశ దర్శన్ స్కీమ్ 2.0 కింద త్వరితగతిన నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేపట్టాలని శుక్రవారం దిల్లీలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షకావత్ ను టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను ఆమోదించి, స్వదేశ దర్శన్ 2.0 కింద కేంద్రానికి ప్రతిపాదనను పంపిందని, ఈ ప్రాజెక్టు సుమారు రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో దశలవారీగా అమలు చేయడానికి రూపుదిద్దుకుందని వివరిస్తూ మంత్రికి వినతి పత్రాన్ని అందించారు. కొండవీడు కోట 14వ శతాబ్దానికి చెందిన ప్రాచీన చారిత్రక స్మారక కట్టడమని, రెడ్డి రాజవంశపు మాజీ రాజధాని అని, కోట పునరుద్ధరణ, తగిన సంరక్షణ చర్యలు, సందర్శకుల సౌకర్యాలు, వివరణాత్మక కేంద్రాలు, సమగ్ర పర్యాటక మౌలిక వసతులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రాజెక్టు అమలు ద్వారా కోట వారసత్వ సంరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి ఊతం లభిస్తుందని వివరిస్తూ పల్నాడు జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే కీలక కార్యక్రమంగా నిలుస్తుందని తెలిపారు. దీని పై మంత్రి సానుకూలంగా స్పందించారు.

## ఆర్వీఆర్‌డజెసి కాలేజీలో వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ పై అవగాహన సదస్సు




**గుంటూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** ఏపీటీఎస్ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ పై గుంటూరు ఆర్వీఆర్‌డజెసి ఇంజనీరింగ్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్(ఏపీటీఎస్)ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. మంత్రి నారా లోకేష్ విన్నూత్న ఆలోచనతో దేశం లోనే తొలిసారిగా 920 కు పైగా ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. 95523 00009 నంబర్‌కు 'హాయ్' మెసేజ్ పంపి మన మిత్ర సేవలను సులభంగా పొందవచ్చని చెప్పారు. విద్యార్థి సేవలు, పౌర సేవలు, రవాణా, భక్తి, రైతు ఉ ఆరోగ్య సేవలు ఒకే వేదిక పై అందుబాటులో ఉన్నాయని మోహన కృష్ణ అన్నారు. నారా చంద్రబాబు నాయుడు విజన్ తో ఏర్పాటు చేసిన ఏపీ సిఎస్‌ఓసి దేశం లోనే అత్యుత్తమ సైబర్ సెక్యూరిటీ మానిటరింగ్ సెంటర్‌గా నిలిచిందన్నారు. రన్ సం వేర్, ఫిషింగ్, మాల్వేర్, డీప్ ఫేక్ మొద లైన సైబర్ మోసాల గురించి మోహన కృష్ణ వివరించారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. అపరిచిత లింకులు క్లిక్ చేయకూడదు, గూగుల్ ప్లే స్టోర్ వెలుపల లభించే ఏపీకే ఫైల్స్ లేదా అనధికారిక యాప్స్ డౌన్‌లోడ్ చేయడం ప్రమాదకరం. పబ్లిక్ వై ఫై లో బ్యాంకింగ్ లావాదేవీలు చేయకూడదు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్ కు కాల్ చేయాలి అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. ఏపీటీఎస్ ప్రతినిధులు శ్రీనివాస్, దినేష్, మదన్ రాజ్ సైబర్ సెక్యూరిటీ, వాట్సాప్ గవర్నన్స్ గురించి సవివరంగా తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఆర్‌డజెసి కాలేజ్ ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్స్ ఎన్వి శ్రీనివాస్ రావు, కొమ్మినేని రవీంద్ర, భారీగా విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.ద

## జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు - నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నర్సీపట్నం సబ్‌డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నక్కపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సి.ఐ. మురళి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మూర్తి ఎస్ ఐ సన్నిబాబు లు ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు ఎన్ హెచ్ ఎ ఐ సిబ్బందితో కలిసి బ్లాక్ స్పాట్స్, ప్రమాద ప్రదేశాలను పరిశీలించారు.

రోడ్డు భద్రతా చర్యలలో భాగంగా జాతీయ రహదారిపై తగినంత లైటింగ్ కొరకు సోలార్ బ్లింకర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న డ్రైనేజీల పై పాడైన సిమెంట్ పలకలు మరమ్మతు చేయాలని సూచించారు. అలాగే భవిష్యత్తులో వాహనాల వేగాన్ని తగ్గించి ప్రమాదాలు నివారించేందుకు రంబుల్ స్ట్రిప్స్, పుటాకార అద్దాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారిపై సాండ్ డ్రమ్ములు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను కూడా పోలీసులు గుర్తించి హైవే సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

## నెహ్రూ టిబెట్ ను చైనాకిచ్చి, పంచశీల ఒప్పందం చేసారు అనిల్ చౌహాన్





**డెహ్రాడూన్:, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అప్పట్లో టిబెట్ ను చైనాకు ఇచ్చేసి పంచశీల ఒప్పందం కుదుర్చుకున్నా ఇప్పటికీ ఆ దేశంతో మనకు సరిహద్దు సమస్యలు కొనసాగుతుండటం పై సీడీఎస్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్-చైనా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదం పై సాయుధ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా స్వాతంత్ర్యం తర్వాత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ టిబెట్ ను చైనా కు ఎందుకు ఇచ్చేశారో, అప్పట్లో కుదిరిన పంచశీల ఒప్పందం ఇప్పటికీ అమల్లో ఉన్నా సరిహద్దు వివాదాలు ఎందుకు పరిష్కారం కావడం లేదో అన్న అంశాల పై సీడీఎస్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశ మవుతున్నాయి. 1954 లో భారత్ టిబెట్ ను చైనా లో భాగంగా గుర్తించిందని, ఇరు పొరుగు దేశాలూ పంచశీల్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని సీడీఎస్ అనిల్ చౌహాన్ ఇవాళ ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో జరిగిన ఓ కార్యక్రమంలో తెలిపారు. ఈ ఒప్పందం ఏదో ఒక విధంగా ఉత్తర సరిహద్దు వివాదాన్ని లాంఛనప్రాయంగా పరిష్కరించినట్లు భారత్ ఆ రోజుల్లో భావించిందని, అయితే చైనా మాత్రం ఇది కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసమే కుదిరిందని తేల్చేసిందన్నారు. ఈ ఒప్పందం కేవలం వాణిజ్యం కోసమే చేసుకున్నారు తప్ప, సరిహద్దు పై చైనా వైఖరిని ఏమాత్రం ప్రతిబింబించలేదన్నారు. బ్రిటీష్ వారు వెళ్లిపోయాక, తమ సరిహద్దు ఎక్కడ ఉందో భారతదేశం నిర్ణయించు కోవాల్సిందని, తూర్పున మనకు మెక్ మోహన్ లైన్ లాంటిది ఒకటి ఉందని నెహ్రూకు బహుశా తెలుసని, లడఖ్ ప్రాంతంలో కూడా మనకు ఏదో ఒక సమస్య ఉందని ఆయనకు తెలుసని, అందుకే బహుశా ఆయన పంచశీల ఒప్పందాన్ని కోరుకున్నారని సీడీఎస్ తెలిపారు. దాదాపు 890 కిలో మీటర్ల పొడవైన మెక్ మోహన్ లైన్ తూర్పున బ్రిటిష్ ఇండియా, టిబెట్‌ల సరిహద్దుగా ఉండేదని, చైనా తన టిబెట్ విముక్తి తర్వాత ఆ ప్రాంతం లోకి ప్రవేశించడంతో పాటు స్థిరత్వాన్ని కోరుకుందన్నారు. స్వతంత్ర భారతదేశం చైనాతో మంచి సంబంధాలను పెంచుకోవడానికి తీవ్రంగా ఆసక్తిగా ఉండేదని, 1949 లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత, అది తన ప్రదేశాల కోసం ఎలాంటి వాదనలు చేయలేదని సీడీఎస్ తెలిపారు. బ్రిటిష్ వారి నుండి వారసత్వంగా పొందిన ప్రత్యేక హక్కులను కూడా వదులుకుందన్నారు. కానీ టిబెట్‌ను ఆక్రమించుకున్నాక ఐరాసలో చైనాకు శాశ్వత సభ్యత్వం లభించడాన్ని భారత్ గుర్తించిన కారణంగా భారత్-టిబెట్ మధ్య ఉన్న హిమాలయ బఫర్ కనుమరు గైందని జనరల్ చౌహాన్ తెలిపారు. అప్పటి నుంచి ఇది సరిహద్దు వివాదంగా మారిందన్నారు. పంచశీల ఒప్పందానికి సరిహద్దుల అంశం పై తమ వైఖరితో ఎటువంటి సంబంధం లేదని చైనా మరోసారి తేల్చేసిందన్నారు.

## విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సరికొత్త సంప్రదాయం





- ★ పార్లమెంటు వారీగా ప్రజాప్రతినిధులు, కుటుంబాలకు విందు
- ★ మచిలీపట్నం పార్లమెంటు ప్రజాప్రతినిధులు, కుటుంబాలతో ముచ్చట్లు
- ★ ఆడపడుచులకు మంగళగిరి పట్టుచీరలు పెట్టిన లోకేష్
- ★ ప్రజాప్రతినిధులు ఇచ్చిన వినతుల తాజాస్థితిని నివేదిక రూపంలో అందజేసిన లోకేష్

**ఉండవల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** పార్లమెంటు, నియోజకవర్గాల వారీగా కూటమి ప్రజా ప్రతినిధులను కుటుంబ సభ్యులతో తన ఇంటికి ఆహ్వానించి, ఆహ్లాదకర వాతావరణంలో విందు ఏర్పాటు చేసి, మాటలు-ముచ్చట్లతో గడిపే సరికొత్త సంప్రదాయానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. ఉండవల్లి నివాసంలో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కుటుంబ సభ్యులతో తన ఇంటికి విందుకు ఆహ్వానించారు లోకేష్. ఈ సందర్భంగా పండగ వాతావరణం నెలకొంది. అంతా ఒకేచోట కూర్చుని భోజనం చేశారు. ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులందరినీ పేరు పేరునా పలకరించిన లోకేష్, ఎలా ఉన్నారు?, ఏం చేస్తున్నారు? అని ఆత్మీయంగా మాటలు కలిపారు. ఎటువంటి రాజకీయ చర్చలకు తావులేకుండా పూర్తిగా కుటుంబంలో జరిగే శుభకార్యంలా నిర్వహించారు. తన ఇంటికి వచ్చిన ఆడపడుచులకు లోకేష్ తన నియోజకవర్గం మంగళగిరి చేనేత కళాకారులు నేసిన పట్టుచీరలు బహుకరించారు. ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాల అభివృద్ధి, వివిధ సమస్యల పై తనకు ఇచ్చిన వినతులు తాజా స్థితి ఏంటో తెలియజేస్తూ మంత్రి నారా లోకేష్ వారికే నివేదిక రూపంలో అందించారు. ఇందులో తాను పరిష్కరించినవి, పరిష్కార దశలో ఉన్నవి, చేయలేక పోయినవి కారణాలు పేర్కొంటూ ఇచ్చిన ఈ నివేదికను చూసి ప్రజా ప్రతినిధులు ఆశ్చర్యపోయారు. ఇంత ట్రాన్సపరెన్సీ రాజకీయాల్లో చూడటం ఇదే మొదటిసారి అంటూ తమ సహచరులకు చెబుతూ సంతోషం వ్యక్తం చేశారు. కుటుంబ విలువలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే తెలుగుదేశం పార్టీ కార్యకర్త నుంచి నాయకుడి వరకూ అందరినీ కుటుంబ సభ్యులుగా భావిస్తుంది. ఎన్టీఆర్ నుంచి మొదలైన ఈ సంప్రదాయం, చంద్రబాబు మరో స్థాయికి తీసుకెళ్లారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నారా లోకేష్ ప్రజా ప్రతినిధుల కుటుంబాలను ఇంటికి పిలిచి గౌరవించి పంపించే సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. పార్లమెంటు సమావేశాల్లో ఉండటంతో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి (జనసేన), అమెరికా పర్యటనలో ఉన్న కారణంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఈ ఆత్మీయ కలయికకు హాజరు కాలేదు. మంత్రి-మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ (జనసేన), పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, చీఫ్ విప్ జీవి ఆంజనేయులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి ఆత్మీయ కలయికలో ఆనందంగా గడిపారు.





## సాక్షి లో సుందరపు భూ బాగోతం శీర్షిక పై స్పీకర్ కి పిర్యాదు



**అమరావతి, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** నా పై నిరాధార ఆరోపణలతో సాక్షి దినపత్రికలో 'సుందరపు భూ బాగోతం' అనే శీర్షిక తో రాష్ట్ర, స్థానిక విలేఖరులు తప్పుడు కథనాలతో ప్రచురించిన విషయం పై సదరు విలేఖరులు, సాక్షి యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు కి వినతిపత్రం అందజేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. అనకాపల్లి జిల్లా, యలమంచిలి నియోజకవర్గం, రాంబిల్లి మండలం, పంచదార్ల గ్రామ రెవెన్యూలో సాగులో ఉన్న డి-పట్టా దళిత రైతుల భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారంటూ సాక్షి దినపత్రికలో ఈ నెల 13 వ తేదీ శుక్రవారం అనకాపల్లి జిల్లా ఎడిషన్ లో 'సుందరపు భూ బాగోతం' అనే శీర్షిక తో ప్రచురించబడ్డ నిరాధార కథనం వలన శాసనసభ్యుడిగా నా హక్కులను హరించేలా నా పై నిరాధార కథనాలను ప్రచురింపజేసి, నా పరువు, ప్రతిష్టను దిగజార్చాలని కుట్ర చేసిన సాక్షి పత్రిక యాజమాన్యం, కథనం రాసిన స్థానిక, రాష్ట్ర విలేకరుల పై తగిన విధంగా సభా హక్కుల కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రైతు బాంధవుడు డాక్టర్ రామిశెట్టి శివశంకర్





* రైతు కోసం నూతన వర్వడికి శ్రీకారం.
* సాగులో రైతుకు వెన్నుదునుగా డాక్టర్ ఆర్ఎస్ఎస్
* ఆంధ్ర తెలంగాణ రైతులకు అందుబాటులో..

**అనంతపురం, పెన్ సత్తా, ఫిబ్రవరి 13**: రైతులు, యువత, సమాజాభివృద్ధి అనే మూడు మార్గదర్శక సూత్రాలతో ముందుకు సాగుతున్న డా.ఆర్ఎస్ ఎస్ ప్రయాణం వ్యవసాయ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తూ, వ్యవసాయం చేసే రైతులకు అండగా మారింది. వ్యవసాయ, సామాజిక రంగాల్లో ఆయన చేస్తున్న విశేష మైన కృషికి రైతుల నుంచే హృదయపూర్వక అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల అభివృద్ధికి నిరంతర కృషి: భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయం, నేటి కాలంలో అధిక పెట్టుబడులు, తక్కువ ఆదాయం, నేల నిస్సారత వంటి సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ సవాళ్లను అధిగమించి రైతులకు ఉత్తమ మార్గదర్శకత్వాన్ని అందించేందుకు రామి శెట్టి శివ శంకర్ నిరంతర కృషి చేస్తున్నారు. కుటుంబ నేపథ్యం: తండ్రి రామిశెట్టి వీరభద్రయ్య రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, తల్లి రామిశెట్టి రమణమ్మ ఇంటి పని వీరు కడప జిల్లా లోని పులివెందులలో జీవనం సాగిస్తున్నారు. నిరుత్సాహానికి తలవంచని విద్యాభ్యాస సంకల్పం. రామ్ శెట్టి శివశంకర్ పులివెందుల పట్టణంలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, తదనంతరం లయోలా కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. 2007 లో సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షలకు సిద్ధమై పరీక్ష రాసినా, కేవలం 0.25 మార్కుల తేడాతో అర్హత సాధించలేకపోయారు. అయినప్పటికీ నిరుత్సాహపడకుండా, 2008 లో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఎస్సీ జియాలజీ పూర్తి చేశారు. 2010 లో యానిమల్ సైకాలజీ విభాగంలో పీహెచ్‌డీ పరిశోధన ప్రారంభించి, 2011 లో యూజీసీ ప్రాజెక్ట్‌గా "రెడ్ గ్రేప్ ఫ్రూట్" అంశం పై పరిశోధనలు చేపట్టారు. 2012 లో యూజీసీ ప్రాజెక్ట్ పూర్తయ్యి, 2014 లో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుండి పీహెచ్‌డీ పట్టాను పొందారు. 2015 లో ప్లాంట్ సైకాలజీ, యానిమల్ సైకాలజీ అంశాల పై విస్తృత పరిశోధనలు నిర్వహించి, సుమారు 40 జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ప్రచురించారు. 2018 లో చీనిపంటి పై పరిశోధన కార్యక్రమాలు చేపట్టారు.

2025 లో దేశం లోనే తొలిసారిగా దేశీ గోవుల గోమూత్రంతో 'సూర్యపుత్ర' అనే పిచికారీ మందును అభివృద్ధి చేశారు. 2018 నుండి, 2026 వరకు రైతులకు సూచనలు, సలహాలు అందిస్తూ వస్తున్నారు. గ్రామం గ్రామం తిరుగుతూ రైతులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ విద్యను అభ్యసించిన రామిశెట్టి శివ శంకర్ ప్రతి గ్రామం తిరుగుతూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు, పొలాల్లోనే పంటలను పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, తక్షణ పరిష్కార సూచనలు అందిస్తు, పంటలకు వచ్చే తెగుళ్లు, మట్టి స్వభావం, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, ఆధునిక సాగు పద్ధతుల పై రైతులకు అవగాహన కల్పిస్తూ, శాస్త్రీయ వ్యవసాయ విధానాల వైపు దారితీస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యక్రమాలు కూడా చేపడుతూ వస్తున్నారు. డాక్టర్ ఆర్ యస్ యస్ రీసెర్చ్ యూట్యూబ్ ఛానల్ ద్వారా సూచనలు రైతులకు అందిస్తున్నారు.

నేటి వ్యవసాయంలో అధికంగా పురుగు మందులు పడుతూ వస్తున్నారు. అయితే ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఎటువంటి అవగాహన లేకుండా రైతులకు ఎరువులు ఇవ్వడంతో రైతులు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉండటం గ్రహించి రైతులు నష్టపోకుండా ఉండాలన్నదే తన ఏకైక లక్ష్యంగా పెట్టుకుని యూట్యూబ్ ద్వారా ఏ రోగానికి ఏ మందు పిచికారి చేయాలి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, భూములు ఎలా సారం పెంచాలి అని రైతులకు తెలియజేస్తూ ఎరువుల వినియోగంలో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని ఆయన యూట్యూబ్ ద్వారా రైతులకు వివరిస్తున్నారు.

దేశీ గోమూత్రంతో 'సూర్యపుత్ర' ద్రవణం -- దేశంలోనే తొలి వినూత్న పరిశోధన: దేశం లోనే తొలిసారిగా దేశీ గోవుల గోమూత్రంతో 'సూర్యపుత్ర' అనే సహజ ద్రవణాన్ని అభివృద్ధి చేశారు. ఈ ద్రావణం పై విస్తృత స్థాయిలో పరిశోధనలు చేపట్టి, శాస్త్రీయ పద్ధతుల్లో తయారు చేసినట్లు తెలిపారు. పూర్తిగా సహజ విధానాల్లో, ఎలాంటి రసాయనాల వినియోగం లేకుండా ఈ ద్రవణాన్ని రూపొందించారు. ఇందు కోసం తన సొంతంగా దేశీ గోవులను పెంచుతూ, గోమూత్రాన్ని శుద్ధి చేసి దేశీ గోమూత్రంతో పాటు కలబంద, కుంకుడుకాయ, శీకాకాయ, ఉసిరి, వేప, జామాయిల్ వంటి ఏడు రకాల ఔషధ తో వినూత్న ఉత్పత్తిని అభివృద్ధి చేశారు. ఈ ద్రవణం పంటల ఎదుగుదలకు దోహదపడటంతో పాటు తెగుళ్ల నియంత్రణలో కూడా ప్రభావవంతంగా పనిచేస్తుందని, తక్కువ ఖర్చుతో రైతులకు లాభదాయకంగా ఉండేలాగా తయారు చేశారు.

రైతు మేలు కోసం సిట్రస్ ప్రోటోకాల్ పుస్తకం: 2025 లో రైతుల మేలు కోసం సిట్రస్ పంటల పై ప్రత్యేకంగా "సిట్రస్" అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉండి, రైతుల నుంచి మంచి స్పందన పొందుతోంది. ఇందులో సిట్రస్ పంటల సాగులో పాటించాల్సిన అడుగడుగునా ప్రోటోకాల్, సాగు పద్ధతులు, పోషక నిర్వహణ, రోగ నివారణ వంటి అంశాలను రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ పుస్తకం సిట్రస్ సాగు చేసే రైతులకు ఒక మార్గదర్శక గ్రంథంగా ఉపయోగపడుతోంది. చిన్న, పేద రైతుల మేలు కోసం అండగా,

చిన్న, పేద రైతుల సమస్యలను దగ్గర నుంచి తెలుసుకుని, వారికి అవసరమైన శాస్త్రీయ అవగాహన, సాగు సలహాలు, ప్రోటోకాల్స్‌ను ఎలాంటి ఖర్చు లేకుండా అందిస్తూ అండగా నిలుస్తున్నారు. రైతులు నష్టాల్లో కాకుండా లాభాల దిశగా సాగేందుకు మార్గనిర్దేశం చేస్తూ, వారి జీవనోపాధి మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నారు. నీత్యం పొలాల్లోనే జీవిస్తూ సాగించిన పరిశోధనలు రెండు సంవత్సరాల పాటు రాత్రి పగలు గుడిసె వేసుకుని నీత్యం పొలాల్లోనే కఠిన పరిశోధనలు నిర్వహిస్తూ, పాములు-- తేళ్లు వంటి ప్రమాదాలను సైతం లెక్కచేయకుండా రైతుల మేలు కోసం నిరంతరం శ్రమించారు.

ఆచరణే ఆయుధం: వేలాదిమందికి స్ఫూర్తిగా డా.ఆర్ఎస్ఎస్. రైతులు, యువత, సమాజ అభివృద్ధి అనే త్రిసూత్రాన్ని ఆలోచనగా కాకుండా ఆచరణగా మలుచుకుని ముందుకు సాగుతున్న , డా. ఆర్ఎస్ఎస్ తన కృషితో ఎందరో మందికి దారి చూపే మార్గదర్శిగా నిలిచాడు. మాటలకన్నా పనితోనే తన స్థాయిని నిరూపిస్తూ, వేలాదిమందికి స్ఫూర్తిగా మారాడు. ఈ ప్రేరణాత్మక ప్రయాణం మరెన్నో జీవితాలకు వెలుగునిచ్చే దీపంలా కొనసాగాలని ఆకాంక్షిద్దాం.





# పశువుల వ్యాపారి శేఖర్ పై చర్యలు తీసుకోవాలి






## నక్కపల్లి పోలీస్ స్టేషన్లో పాడి రైతులు కూలీలు ఫిర్యాదు

**నక్కపల్లి,పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** మండలంలో దేవవరం, నామవరం పాడి రైతులు, పాడి పశువుల వ్యాపారస్తులపై దౌర్జన్యానికి పాల్పడుతున్న పశువుల వ్యాపారి శేఖర్ పై చర్యలు తీసుకోవాలని నక్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం దేవవరం నామవరం గ్రామాలకు చెందిన పలువురు పశువుల వ్యాపారులు, కూలీలు నక్కపల్లి పోలీస్ స్టేషన్ వద్ద నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు, సీఐ మురళి లకు శేఖర్ పై పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ పూర్వం నుండి తమ కుటుంబాలు పశువుల సంతలో పాడి పశువుల కొనుగోలు విక్రయాల ద్వారా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నామన్నారు. విజయనగరం జిల్లా, కొత్తవలస కు చెందిన శేఖర్ అనే వ్యక్తి పశువుల సంతల్లో పరిచయమై సుమారు 200 మంది వరకు కూలీలు కావాలని చెప్పడంతో అతని వద్ద కూలీ పనులకు చేరమన్నారు. కూలీల వద్ద నుండి ఆధార్ కార్డులు సేకరించి తన వద్ద ఉంచుకున్నాడు అన్నారు శేఖర్ సంతల్లో పశువులను కొనుగోలు చేసి తనకున్న 50 వాహనాల్లో నిత్యం పశువులను ఇతర రాష్ట్రాల్లో ఉన్న కళేబరాలకు తరలించేవాడిని తెలిపారు. ఈ విషయం తెలుసుకుని అతని వద్ద పనులు మానేసి సొంతంగా సంతల్లోనూ, రైతుల వద్ద పాడి పశువులను కొనుగోలు చేసి వేరే సంతల్లో లాభాలుకు అమ్ముకుని తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. శేఖర్ వద్ద పని మానేసినందుకు తమపై కక్షగట్టి మా వ్యాపారాలకు అడ్డుపడడమే కాకుండా మా యొక్క వాహనాలను పోలీసులకు పట్టించడం, వాహనాలు పాసింగ్ చేయడానికి వేలాది రూపాయలు వసూలు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. శేఖర్ నియమించుకున్న సొంత మనుషులతో బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని డబ్బులు ఇవ్వని పక్షంలో పోలీసులతో పట్టిస్తున్నాడని అన్నారు. తామంతా రైతులకు అవసరమయ్యే పాడి పశువుల కొనుగోలు విక్రయాలు మాత్రమే చేస్తున్నామని తమ వ్యాపారాలు అడ్డుపడుతున్న శేఖర్ పై చర్యలు తీసుకోవాలని బాధిత కూలీలు రాంప్రసాద్, నాగేశ్వరరావు లు నక్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# చెత్త రహిత పాలనకు ప్రజలు అందరూ సహకారం అందించాలి

* మన రాష్ట్రాన్ని మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి
* విద్యార్థులు అందరూ పర్యావరణ హితంగా జీవించాలి
* నాగలక్ష్మి, డైరెక్టర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** చెత్త రహిత పాలనకు ప్రజలు అందరూ సహకారం అందించాలి అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి కోరారు. శుక్రవారం ఉదయం మద్దిలపాలెం లో శ్రీ భావన విద్యా నికేతన్ కరస్పాండెంట్ శ్యామ్ కుమార్ అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, ఎస్ ఆర్ యు – జివిఎంసి లో నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్పొరేషన్ లో "చెత్త రహిత పరిపాలన" (జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన దేశానికి ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చి దిద్దాలని కోరారు. విద్యార్థులు అందరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరుతూ అవగాహన కల్పించారు. మేధావులు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద కార్పొరేషన్ విశాఖపట్నం జిల్లా ఐసిసి కో ఆర్డినేటర్ శృతి శ్రీ మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలు, నగరవాసులు అందరూ చెత్త రహిత నగరంగా విశాఖ మహానగరాన్ని తీర్చి దిద్దడానికి కంకణబద్ధులై జీవించాలని కోరారు. మన అంద మైన నగరాన్ని ఒక సుందర మైన విధంగా తీర్చి దిద్దాలని కోరారు. వంటింటి వ్యర్థాలతో ఎరువు తయారు చేసి ఎవరి ఇంటి వద్ద వారె కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం అవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, గ్రీన్ వాలంటీర్ జె రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ మున్సిపల్ కుర్చీ కాంగ్రెస్ కైవసం

* హోరాహోరీగా సాగిన పోటీలో కాంగ్రెస్ కు గట్టి పోటీ ఇచ్చిన బిఆర్ఎస్
* కాంగ్రెస్ కు 15, బిఆర్ఎస్ కు 11 వార్డులలో విజయం
* ఇండిపెండెంట్ 1 , బిజెపి 1 వార్డులతో పరిమితం




**షాద్ నగర్: , పెన్ సత్తా, ఫిబ్రవరి 13:ఫిబ్రవరి 13:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో హోరాహోరీగా సాగిన పోరులో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠాన్ని దక్కించుకుంది. శుక్రవారం స్టేడియం గ్రౌండ్ లో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుండి ఓట్లను లెక్కించగా షాద్ నగర్ లో మొత్తం 28 వార్డులో ఉండంగా మొదటి రౌండ్ లో 14 వార్డులను లెక్కించారు. అందులో భాగంగా కాంగ్రెస్ నుండి 8 మంది అభ్యర్థులు గెలుపొందారు. అదేవిధంగా బిఆర్ఎస్ నుండి 5 మంది అభ్యర్థులు గెలవగా బిజెపి నుండి ఒక అభ్యర్థి గెలిచారు. అనంతరం రెండో రౌండ్ ఓట్లు ప్రారంభించగా కాంగ్రెస్ నుండి 7 మంది అభ్యర్థులు గెలిచారు. అదేవిధంగా బిఆర్ఎస్ నుండి 6 ఆరు మంది అభ్యర్థులు బిఆర్ఎస్ ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకరు గెలిచారు. కొన్ని వార్డులలో నువ్వా నేనా అన్నట్టుగా కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు బలంగా ఢీకొన్నారు. ఒకానొక సందర్భంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ సమానమైన అభ్యర్థులను గెలుచుకున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థి కీలకమనే విధంగా ఓటు పోరు నడిచింది. ఆఖరిలో కాంగ్రెస్ అభ్యర్థులు వరుసగా గెలవగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయాన్ని అందుకొని మున్సిపల్ పీఠాన్ని దక్కించుకున్నారు.

**గెలుపొందిన అభ్యర్థుల వివరాలు :-**

1.వ వార్డు గౌస్ జానీ (బిఆర్ఎస్)
2.వ వార్డు బచ్చలి నరేష్ (కాంగ్రెస్)
3.వ వార్డు నందారం అశోక్(బిఆర్ఎస్)
4.వ వార్డు వాణి పాండు రంగారెడ్డి(బిఆర్ఎస్)
5.వ వార్డు శిరీష అనిల్ (కాంగ్రెస్)
6.వ వార్డు రాజు నాయక్ (కాంగ్రెస్)
7.వ వార్డు కొప్పునూరి ప్రవీణ్ (కాంగ్రెస్)
8.వ వార్డు సుధీర్ ( స్వతంత్ర అభ్యర్థి )
9.వ వార్డు ప్యాట అశోక్ (బీజేపీ)
10.వ వార్డు శ్రావణి (కాంగ్రెస్)
11.వ వార్డు పిల్లి శారదా శేఖర్ (బిఆర్ఎస్)
12.వ వార్డు దిలీప్ (కాంగ్రెస్)
13.వ వార్డు రిజ్వాన ముబారక్ (కాంగ్రెస్)
14.వ వార్డు అందే మోహన్ (కాంగ్రెస్)
15.వ వార్డు మరియా బేగం సాదిక్ (కాంగ్రెస్)
16.వ వార్డు జయలక్ష్మి కిషోర్ (బిఆర్ఎస్)
17.వ వార్డు నాజీయాబేగం
సర్వర్ పాషా (కాంగ్రెస్)
18.వ వార్డు జాములూరు సంతోషి బాయి (కాంగ్రెస్)
19.వ వార్డు అరిఫా బేగం అడ్డు (బిఆర్ఎస్)
20.వ వార్డు పినమోనీ గోపాల్ (బిఆర్ఎస్)
21.వ వార్డు జిటి వసంత సంతోష్ (బిఆర్ఎస్)
22.వ వార్డు నడికుడ అనిత రఘునాథ్ యాదవ్ (బిఆర్ఎస్)
23.వ వార్డు అగ్గనూరు బస్వం అప్ప (కాంగ్రెస్)
24.వ వార్డు అగ్గనూరు విశ్వం (కాంగ్రెస్)
25.వ వార్డు పెంటయ్య (కాంగ్రెస్)
26.వ వార్డు శివ (బిఆర్ఎస్)
27.వ వార్డు మురళీ మోహన్ (కాంగ్రెస్)
28.వ వార్డు లక్ష్మి ప్రసన్న వేణు (బిఆర్ఎస్)
తదితర అభ్యర్థులు గెలిచారు.

# కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్న డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత





**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:** దేవాదాయ ధర్మాదాయ శాఖ వేల్పుపుల వీధి స్వయంభు దేవాలయం కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెను పాలకవర్గ సభ్యులు, ఈవో ఘనంగా సత్కరించారు. ఆలయంలో స్తంభానికి నూతనంగా తయారు చేసిన ఇత్తడి తొడుగులు పూజలు చేసి ప్రారంభించారు. ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లు కూడా ఏ విధంగా చేస్తున్నారో ఆలయ ఈవో బి మురళీకృష్ణ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాటికొండ కామేశ్వరరావు(రాంబాబు), ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక దృక్పథంతో నే మానవ ప్రగతి సాధ్యం.

- విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు టి .రమేష్.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 13**శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థుల్లో ప్రకృతి,రాజ్యాంగం, సైంటిఫిక్ టెంపర్ పట్ల అవగాహన కోసం సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందిని విజ్ఞాన దర్శినిలి వ్యవస్థాపక అధ్యక్షులు టి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజ్ఞానిక దృక్పథంతోనే మానవ ప్రగతి సాధ్యమని ప్రజా శాస్త్రవేత్త ప్రకృతిని వైజ్ఞానిక దృక్పథాన్ని రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో జనవరి 27 నుండి ఫిబ్రవరి 28 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విజ్ఞాన దర్శిని ది నెహ్రూ సెంటర్ మరియు నేచర్ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యం లో ప్రకృతి వైజ్ఞానిక యాత్రని 27న సోమశిల లో ప్రారంభించి ఈ యాత్ర నేడు భద్రాద్రి జిల్లా భద్రాచలం రావటం సంతోషంగా ఉందని, ఈ రోజుల్లో విద్యార్థులకు సైంటిఫిక్ టెంపర్ ఉండటం లేదు. మనిషి విశ్వాంతరాల్లోకి ప్రయాణిస్తున్న మూఢ నమ్మకాలు కూడా వెంటనే ప్రయాణిస్తున్నాయని, వీటిని వీడి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ప్రశ్నించడం,ఆలోచడం ద్వారా జ్ఞానం వస్తున్నాదని, తద్వారా నిర్ణయాలు తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ ఆశాల జాన్ మిల్టన్, బోటాని డిపార్ట్మెంట్ నాగ సమీరా మరియు విజ్ఞాన దర్శిని నాయకులు రాజేశ్వరావు,వెంకట్ ఉలవల, సత్య, అప్పారావు, సత్యనారాయణ, పోలీస్ ప్రసాద్,కృష్ణ,విజయ్, డాక్టర్ ప్రసాద్ తో పాటు, కన్ను శరీర మరియు అవయవ దాన ప్రోత్సాహస సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంజి ఈశ్వర లింగం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ మున్సిపల్ కుర్చీ కాంగ్రెస్ కైవసం



**పెన్ సత్తా, ఫిబ్రవరి 13:**మోత్కూర్ మున్సిపల్ లో 12 వార్డులకు గాను ఎనిమిది వార్డులు కాంగ్రెస్ కైవసం చేసుకోవడం జరిగింది దీనితో మ్యాజిక్ ఫిగర్ నెంబర్ దాటడంతో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ సీట్ కైవసం చేసుకోవడం జరిగింది. 1వ వార్డ్ పల్లెర్ల వెంకన్న, 2వ వార్డ్ కురుమిళ్ళ ప్రమీల రాములు 6వ వార్డ్ గడ్డం స్వప్న సోమ నరసయ్య, 7 వ వార్డ్ గనగాని శైలజ నరసింహ గౌడ్,8వ వార్డ్ పన్నల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి, 9వ వార్డ్ బిసు శ్రీకాంత్ గౌడ్,11వ వార్డ్ కారుపోతుల వెంకన్న 12వ వార్డ్ మెంట రమణ నాగేష్ గెలుపు పొందడం జరిగింది

# సరిలేరు నీకెవ్వరు... చిన్నారులు చిచ్చరపిడుగులు



- చదరంగం మాస్టర్ వానరాసి జగన్ ఆధ్వర్యంలో శిష్యుల సత్తా
- వేదిక ఏదైనా...మొదటి బహుమతి తమదే.

**షాద్ నగర్ పెన్ సత్తా, :ఫిబ్రవరి 23:**షాద్‌నగర్ పట్టణంలోని ఇండియన్ హైట్స్ పాఠశాలలో నిర్వహించిన టౌన్ లెవల్ చదరంగం పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. అండర్ 08, 10, 12, 14, 16 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన ఈ పోటీల్లో షాద్‌నగర్ చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి మెరిశారు.
అండర్--08 విభాగంలో సాయి సొరేష్, నందిక, వేదాన్ష్ మెప్పించగా, అండర్--10లో కార్తికేయ, నిఖిల్, లక్ష్మణ్ సిద్ధార్థ్, శ్రీమన్ రెడ్డి, ఆయుష్ ప్రతిభ చాటారు. అండర్--12లో శ్రీ హర్షిత్, వేదాదిత్యం రాణించగా, అండర్--14లో సాయి సుశాంత్, భాను తేజ సత్తా చూపించారు. అండర్--16 విభాగంలో సాత్విక్ చందర్ అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.
వీరు అందరూ మెరిట్ సర్టిఫికెట్లు, ట్రోఫీలు, గోల్డ్ మెడల్స్ సాధించి తమ ప్రతిభను నిరూపించారు. చిన్నారులు చూపిన ఆటతీరు ప్రేక్షకులను అలరించడమే కాకుండా, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగల సామర్థ్యం తమలో ఉందని నిరూపించింది.
ఈ సందర్భంగా కోచ్ వానరాసి జగన్ మాట్లాడుతూ...చదరంగం ఆట మెదడుకు పదును పెడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయశక్తి పెంపొందిస్తాయి.చిన్నప్పటి నుంచే చెస్ అలవాటు చేసుకుంటే పిల్లలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారని తెలిపారు.గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.
పోటీల్లో విజేతలైన విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలు మరిన్ని నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# పాత పాల్వంచలో మరోసారి సత్తా చాటిన కొత్వాల.

**మాజీ మంత్రి వనమా వర్సెస్ కొత్వాలలో కొత్వాలకే విజయం.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 13**కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికల్లో పాత పాల్వంచలో కొత్వాల తన సత్తా నిరూపించారు. ఈ నెల 11 తేదీన జరిగిన ఎన్నికల్లో పాల్వంచ 46 వ డివిజన్ కొత్వాల సతీమణి విమలా దేవి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినిగా పోటీ చేశారు. శుక్రవారం జరిగిన కౌంటింగ్ లో ఆమె తన సమీప ప్రత్యర్థి సిపిఐ అభ్యర్థిని మహ్మద్ జిలానీ బేగం పై 442 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థిని విమలాదేవి కి 1005 ఓట్లు రాగా సిపిఐ అభ్యర్థి మొహ్మద్ జిలానీ బేగంకి 563 ఓట్లు, దీ=యా అభ్యర్థిని పరిటాల శ్రీలతకి 367 ఓట్లు వచ్చి మూడవ స్థానంలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కొత్వాల మేన మామ, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు, ఆయన కుమారులు వనమా రాఘవేంద్ర రావు, వనమా రామక్రిష్ణ కుటుంబసభ్యులు కొత్వాల కు వ్యతిరేకంగా బి ఆర్ ఎస్ అభ్యర్థికి మద్దతుగా విశేషంగా ప్రచారం గావించినప్పటికీ కొత్వాలకే గెలిపు వరించింది.



పాల్వంచలో కొత్వాల విమలాదేవిల విజయోత్సవం.
46వ డివిజన్ నుండి విజయం సాధించిన లికొత్వాల విమలాదేవి, డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు లు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనుబోస్ కళాశాల కౌంటింగ్ కేంద్రం నుండి పాత పాల్వంచలోని వరకు ప్రదర్శన నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మిత్రులు కొత్వాల అభిమానులు పాల్గొన్నారు.

# బాగా చదువుకుంటే బంగారు భవిష్యత్తు





- తోటాడ హైస్కూల్ లో పబ్లిక్ పరీక్షల అవగాహన సదస్సు

**మునగపాక, పెన్ సత్తా, ఫిబ్రవరి 13:**-లక్ష్యాన్ని నిర్దేశించుకొన్నప్పుడే అనుకున్నది సాధించగలరని లైఫ్ కోచ్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకులు అలజంగి ఉదయ కుమార్ అన్నారు. తోటాడ జెడ్పి హైస్కూలులో ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి భయం లేకుండా ఉండాలని సూచించారు. కని పెంచిన తల్లిదండ్రులను, పాఠాలు నేర్పే ఉపాధ్యాయులను ఎప్పుడూ గౌరవిస్తూ ఉండాలని అన్నారు. చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పది పరీక్షల్లో సత్తా చాటి పాఠశాలకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్వివి పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్న కుమార్ , ట్వింకిల్ శ్యామ్, స్థానిక నాయకులు దొడ్డి రమేష్, కుమార్, ట్రస్ట్ సభ్యులు వానపల్లి అప్పలరాజు, కాకి అప్పారావు, నూకలక్ష్మి నారాయణ, వీరబాబు, ఎంపిపి స్కూల్ హెచ్ఎం శివరామ ప్రసాద్, ఉపాధ్యాయులు రామచంద్రరావు, అధ్యాపకులు, స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో పదవతరగతి నమూనా పరీక్షలు





**నక్కపల్లి, పెన్ సత్తా, పిబ్రవరి13:**భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పలు పాఠశాల లో నమూనా పరీక్షను శుక్రవారం నిర్వహించారు. జానకయయ్య పేట హైస్కూల్ హెచ్ఎం బషీర్ ఖాన్ నమూనా ప్రశ్నపత్రం విడుదల చేసి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఇటువంటి పోటీ పరీక్షలు పదో తరగతి పబ్లిక్ ముందు నిర్వహించడం విద్యార్థుల కు ఎంతో ఉపయోగపడతాయని పరీక్షలు పట్ల భయాందోళనలు తొలగిపోయి వారిలో పోటీ తత్వం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు ఈ పరీక్షను ఉపయోగించుకొని పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పోటీ పరీక్షలతో పాటు అనేక సేవా కల్చర్ ప్రోగ్రాం లాంటివి ఎన్నో నిర్వహిస్తూ ఉంటుందని ఆటల పోటీలు, విద్యార్థులు యువకులు మత్తు మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్ధాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటుందని తెలిపారు. నక్కపల్లి, ఎస్ రాయవరం మండలాల లో విద్యార్థుల కు ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందని అన్నారు.

# బిల్లు లు సబ్మిట్ చేయడానికి అనుమతి నివ్వండి.

- రాష్ట్ర ట్రెజరీ ఉన్నతాధికారులను కోరిన టి.ఎన్.యు.ఎస్.





**మంగళగిరి, పెన్ సత్తా, ఫిబ్రవరి 13**: వివిధ కారణాల వల్ల ఆగిపోయిన డి. ఏ. పాత బకాయిలను సబ్మిట్ చేయడానికి అనుమతి ఈయవలసినదిగా రాష్ట్ర ట్రెజరీ ఉన్నతాధికారులను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం మంగళగిరి రాష్ట్ర నిధి భవంలో తెలుగునాడు ఉపాధ్యాయసంఘం రాష్ట్ర సెక్రటరీ కె. జయరాజు నాయకత్వం లో కలసి వినతి పత్రం అందించారు. నూతనంగా డైరెక్టర్ గ్యాపదవీ బాధ్య త లు తీసుకున్న కే. పద్మజ గని మర్యాద పూర్వకంగా కలసి అభినందించారు. అదనపు సంచాలకులు శ్రీనివాసులు నాయక్ పూజారి, డి.డి. జి. సత్యనారాయణ లను కలసి ట్రెజరీ పాత కరువు బత్య బిల్లులను సబ్మిట్ చేయుటకు ఫ్రీజింగ్ తొలగించాలని కోరారు. దీని పై వారు స్పందిస్తూ ఈ విషయం తప్పనిసరిగా పరిశీ లిస్తామని హామీ ఇచ్చారు. ప్రతినిధి బృందంలో టి.ఎన్.యు.ఎస్. రాష్ట్ర కార్యదర్శి ఎన్.వీ. జగదీష్ కుమార్, జిల్లా అధ్యక్షులు పసలా బాలస్వామి, కే.ఎస్.ఎన్., జి. గోవింద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు వైఎస్ఆర్సీపీ నాయకుల మద్దతు.



**పెన్ సత్తా, ఫిబ్రవరి 13** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో దళితుల భూములను లాక్కొనేందుకు కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, అతని అనుచరుడు వసంతవాడ దినబాబు భారీ స్కెచ్ వేశారని,దాదాపుగా రూ. 200 కోట్లు విలువైన 43.60 ఎకరాలు భూమి కబ్జా చేయాలని చూస్తున్నారంటూ రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామానికి చెందిన దళితులు ఆరోపిస్తున్నారు. 1978లో సర్వే నెంబర్ 2లో 31 దళిత కుటుంబాలకు 43.64 ఎకరాలు భూమి ఇచ్చింది. దళితులకు ఇచ్చిన భూముల్ని దౌర్జన్యంగా లాక్కొనేందుకు కూటమి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్కెచ్ వేశారంటూ దళితులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. వాళ్లకు మద్దతుగా వైఎస్ఆర్సిపీ నాయకులు యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ,మరియు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్,మాజీ శాసనసభ్యులు పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు,వైఎస్ఆర్సిపీ మీడియా అధికార ప్రతినిధి ఒ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మంచా నాగమల్లేశ్వరి, రాంబిల్లి మండలం ఎంపీపీ శ్రీనుబాబు శిరీష, జడ్పిటిసి నాగరాజు, పంచదారలు ఎంపిటిసి దూల రమణ అమ్మాజీ, రాంబిల్లి మండలం కాపు సంఘం అధ్యక్షులు ఉప్పులూరు నాయుడు,యలమంచిలి ఎక్స్ ఎంపీపీ బోదేపు గోవింద్, యలమంచిలి జడ్పిటిసి సేనాపతి రాము,అచ్చుతాపురం ఎంపీపీ కోన బుజ్జి, నాలుగు మండలాల సర్పంచులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## బీఎన్ఎస్ విజయం వెనక యువ నాయకురాలు

బంగ్లాదేశ్ ఇపుడు అంతర్జాతీయంగా గట్టిగా వినిపిస్తున్న పేరు. బంగ్లాదేశ్ లో గత రెండేళ్ళుగా శాంతి భద్రతలు పెద్దగా లేవు, నిత్యం అల్లర్లు, ఘర్షణ వాతావరణంతో దేశం ఎపుడు అంతర్జాతీయ మీడియాలో కనిపిస్తూనే ఉంది. ప్రత్యేకించి హిందువుల మీద దాడులు హత్యలు కూడా హాట్ టాపిక్ గా మారాయి. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన బంగ్లాదేశ్ ఎన్నికల్లో దేశ ప్రజలంతా ఏకమొత్తంగా తీర్మానించుకుని మరీ 299 స్థానాలకు గానూ 212 స్థానాలను బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి కట్టబెట్టారు. దాంతో బీఎన్ఎస్ అద్భుతమైన విజయం సాధించింది. అతి తక్కువ సమయంలో ఇంతటి అద్భుతమైన విజయం బీఎన్ఎస్ ని దక్కడం వెనక ఒక యువ నాయకురాలి ప్రభావం అత్యధికంగా ఉందని అంటున్నారు.

**మామ్మకు తగిన మనవరాలు :**

ఆమె ఎవరో కాదు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని అయిన ఖలీదా జియా మనవరాలు. అదే విధంగా బీఎన్ఎస్ అధినేత కాబోయే ప్రధాని అయిన తారిక్ రెహ్మాన్ కుమార్తె. ఇరవై ఎనిమిదేళ్ళ ఈ యువ నాయకురాలి పేరు జైమా జర్నాజ్. ఆమె తారిఖ్ రెహ్మాన్ దంపతులకు ఏకైక కుమార్తె. లండన్ లోని క్వీన్ మేరీ విశ్వవిద్యాలయం నుంచి న్యాయ పట్టా అందుకున్న జైమా జర్నాజ్ తండ్రితో పాటు బంగ్లాదేశ్ కి ఈ మధ్యనే వచ్చారు. 2009లో బీఎన్ఎస్ ఓటమి తరువాత లండన్ లోనే ఖలీదా జియా కుటుంబం అంతా ఉంటూ వచ్చింది. ఇక షేక్ హసీనా ప్రభుత్వం కుప్ప కూలి బంగ్లాదేశ్ లో అల్లర్లు అన్నీ మొదలై అల్లకల్లోలం అయిన ఏడాది తరువాత తారిఖ్ రహ్మాన్ ఫ్యామిలీ మొత్తం బంగ్లాదేశ్ లోకి అడుగుపెట్టింది.

**అతి తక్కువ టైంలోనే :**

ఈ మధ్యలోనే ఖలీదా జియా మరణించారు కూడా. అదే సమయంలో తాత్కాలిక ప్రభుత్వం ఎన్నికలను ప్రకటించింది. చాలా తక్కువ టైం ఎన్నికలకు ఉంది. నిజానికి బీఎన్ఎస్ గెలుస్తుంది అని అనుకున్నారు కానీ తక్కువ సమయం అవడం వల్ల పూర్తిగా జనాల మద్దతు దక్కుతుందా అన్న సందేహాలు చాలా మందిలో ఉన్నాయి. అయితే బంగ్లాదేశ్ రాజకీయాలను ఘర్షణలను చూసిన జనాలు తాత్కాలిక ప్రభుత్వం తీరు మీద తీవ్రంగా మండిపడ్డారు. కరెక్ట్ టైం లో తారిఖ్ రహ్మాన్ ఫ్యామిలీ బంగ్లాకు రావడంతో జనాలు వారి మీద ఆశలు పెద్ద ఎత్తున పెంచుకున్నారు. దాంతో తక్కువ టైం అన్నది చూడలేదు, బీఎన్ఎస్ ని గెలిపించాలి అని నిర్ణయానికి వచ్చారు.


**ఆమె దూకుడుతో :**

అచ్చం నానమ్మ ఖలీదా జియా మాదిరిగానే మనవరాలు జైమా జర్నాజ్ పరిణతి సాధించారు అన్నట్లుగా ఆమె రాజకీయాల్లో దూకుడు చూపించారు. తండ్రి తారిఖ్ రహ్మాన్ కి తోడుగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించిన తీరు కానీ ప్రజలతో మమేకం అయిన విధానం కానీ ప్రజలను ఎంతగానో ఆకాట్టుకుంది. అంతే కాదు వీధులలో కలియ తిరిగారు, జన సమాన్యాన్ని కలిశారు అంతే కాదు రిక్షాలు తొక్కారు, కరపత్రాలు తానే స్వయంగా పంపిణీ చేశారు. అలా ఆమె చేపట్టిన ప్రచారం ఒక సునామీ మాదిరిగా మారింది. ఈ క్రమంలో గట్టిగా పోటీ ఇస్తుంది అనుకున్న జమాత్ ఏ ఇస్లామీ పార్టీ పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది.

**ట్రెండింగ్ లో :**

ఇక జైమా జర్నాజ్ తన ప్రచారంతో పాటు నాన్నమ ఖలీదా జియాతో తమ అనుబంధం ప్రజలకు ఆమె చేసిన సేవలు ఇవన్నీ ప్రజల ముందు పెట్టారు. దాంతో ఆమె ఉపన్యాసాలు భావోద్వేగాలు ఆమె దూకుడుతో కూడిన వైఖరి ఇవన్నీ సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్టర్ గా నిలిచాయి. బంగ్లాకి ఒక యువ నాయకురాలు దొరికారు అని అంతా అంటున్న మాటగా ఉంది. తండ్రికి ఎంతో చేదోడు వాదోడుగా ఉన్న జైమా జర్నాజ్ రేపటి బంగ్లా దేశ్ కి సరికొత్త ఆశా కిరణంగా చెబుతున్నారు. మొత్తానికి ఆమె చేసిన అద్భుతం బంగ్లాకు నూతన దారి చూపించింది అని అంటున్నారు.

# రాత్రి నిద్రలో పదే పదే మెలకువ వస్తుందా?



రాత్రిపూట తరచుగా మేల్కొనే వారికి తగినంత నిద్ర ఉండదు. ఇలా నిద్ర రాకపోతే దానిని సాధారణ సమస్యగా విస్మరించకూడదు. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనం ప్రకారం రాత్రిపూట తరచుగా మేల్కొని తగినంత నిద్ర లేకపోతే అది గుండె ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా చేయవల్సింది సరిగ్గా నిద్రపోవడం. రాత్రిపూట తరచుగా మేల్కొనే వారికి తగినంత నిద్ర ఉండదు. ఇలా నిద్ర రాకపోతే దానిని సాధారణ సమస్యగా విస్మరించకూడదు. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనం ప్రకారం రాత్రిపూట తరచుగా మేల్కొని తగినంత నిద్ర లేకపోతే అది గుండె ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ఈ సమస్య ఎక్కువ కాలం కొనసాగితే ఇది అనేక ప్రమాదకరమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. పరిశోధన ప్రకారం ఒక వ్యక్తి రాత్రి పూట కనీసం 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. లేకుంటే అది ఆరోగ్యాన్ని మరింత దిగజార్చుతుంది. మీకు కూడా నిద్రపోతున్నప్పుడు తరచుగా మెలకువ వస్తుందా? దీనివల్ల మీ నిద్ర చెదిరిపోతుందా? నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం తగినంత నిద్ర రాని వారికి అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. తగినంత నిద్ర రానప్పుడు శరీరం తనను తాను పూర్తిగా రిపేర్ చేసుకునే అవకాశం లభించదు. ఇది గుండె పనితీరును ప్రభావితం చేస్తుంది. అంతే కాదు ఇది మెదడును కూడా ప్రభావితం చేస్తుందని పరిశోధనలో వెల్లడైంది. మంచి రాత్రి నిద్రలో గుండె విశ్రాంతి పొందుతుంది. దీంతో రక్తపోటు సాధారణ స్థాయిలో ఉంటుంది. కానీ నిద్రలో పదేపదే అంతరాయం కలిగితే, గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది వాపుకు దారితీస్తుంది. అంతేకాకుండా, గుండెపోటు ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. రాత్రికి 2 నుంచి 3 సార్లు మేల్కొనే వారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం 30% ఎక్కువగా ఉంటుంది. నిద్రలో తరచుగా మేల్కొనడానికి కారణం మీ మెదడు. అంటే మీరు నిద్రపోయిన తర్వాత కూడా అది మరింత చురుకుగా ఉంటుంది. దీని అర్థం మీరు దేని గురించో ఎక్కువగా ఆలోచిస్తూ ఉండవచ్చు లేదా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారని అర్థం. మానసిక ఒత్తిడి ఉంటే అది గుండెను కూడా ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే మానసిక ఒత్తిడి గుండెపోటుకు ఒక సాధారణ కారణం. అందువల్ల మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీకూ రాత్రి సమయంలో తరచుగా మేల్కొనే సమస్య ఉంటే తప్పకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించండి.


# గ్యాస్ తగ్గాలని సోడా తాగుతున్నారా?





పొట్టలో గ్యాస్, ఉబ్బరం ఉన్నప్పుడు చాలామంది సోడా లేదా కూల్ డ్రింక్స్ తాగితే ఉపశమనం లభిస్తుందని భావిస్తారు. పొట్టలో గ్యాస్, ఉబ్బరం తగ్గించడానికి సోడా తాగడం తాత్కాలిక ఉపశమనం ఇవ్వొచ్చు కానీ, ఇది ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కార్బోనేటెడ్ డ్రింక్స్ స్పింటర్‌ను దెబ్బతీసి యాసిడ్ రిఫ్లక్స్‌కు దారితీస్తాయి. తద్వారా అన్నవాహిక క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. కొంచెం ఎక్కువగా తిన్నా.. లేదా పొట్టలో గ్యాస్, ఉబ్బరం లేదా తేపుల సమస్యలతో బాధపడుతున్నప్పుడు చాలామంది సోడా, కూల్ డ్రింక్స్ లేదా ఇతర కార్బోనేటెడ్ పానీయాలను తాగుతారు.. ఇలా చేస్తే వెంటనే ఉపశమనం లభిస్తుందని నమ్ముతారు.. అయితే.. సోడా తాగిన తర్వాత.. తక్షణమే కొంత తేలికపడిన అనుభూతి కలిగించినా.. ఈ అలవాటు ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాలను కలిగిస్తుందని గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌లు పేర్కొంటున్నారు. ఈ పానీయాలు కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందిస్తాయి తప్ప, మూల సమస్యకు పరిష్కారం కాదని వైద్యులు పేర్కొంటున్నారు. కార్బోనేటెడ్ డ్రింక్స్, కెఫీన్ బేస్డ్ డ్రింక్స్, ఫ్లేవర్డ్ డ్రింక్స్ వంటివి మన శరీరంలోకి వెళ్ళినప్పుడు, జీర్ణవ్యవస్థలోని ముఖ్యమైన భాగమైన స్పింటర్‌లను ప్రభావితం చేస్తాయి. స్పింటర్‌లు అంటే అన్నవాహిక ? పొట్ట మధ్య ఉండే కండర వలయాలు. ఇవి ఆహారం, పొట్టలోని ఆమ్లం పైకి, అంటే అన్నవాహికలోకి తిరిగి రాకుండా నిరోధిస్తాయి. మనం తలకిందులుగా యోగాసనాలు వేసినా కూడా పొట్టలోని పదార్థాలు పైకి రాకుండా ఈ స్పింటర్‌లు రక్షిస్తాయి. అయితే, సోడా వంటి కార్బోనేటెడ్ పానీయాలను అధికంగా తాగడం వల్ల ఈ స్పింటర్‌లు బలహీనపడతాయి లేదా కృత్రిమంగా రిలాక్స్ అవుతాయి. ఇలా క్రమంగా దెబ్బతింటాయి. స్పింటర్‌లు డ్యామేజ్ అవ్వడం వల్ల పొట్టలో ఉండాల్సిన ఆమ్లం ఫుడ్ పైప్‌లోకి ప్రవేశించడం ప్రారంభమవుతుంది. దీనినే యాసిడ్ రిఫ్లక్స్ అంటారు. అన్నవాహికలోని మ్యూకోసా (లోపలి పొర) పొట్టలోని ఆమ్లాన్ని తట్టుకునే విధంగా ఉండదు. నిరంతరం యాసిడ్ రిఫ్లక్స్ వల్ల అన్నవాహికలోని కణజాలం దెబ్బతిని, బ్యారెట్ ఈసోఫేగస్ అనే స్థితికి దారితీస్తుంది. ఇది క్యాన్సర్‌కు పూర్వ దశగా పరిగణిస్తారు. గత 20-25 సంవత్సరాలుగా ఇండియాలో, ముఖ్యంగా సబ్ కాంటినెంట్ ప్రాంతంలో అన్నవాహిక (ఈసోఫేగస్), పొట్ట పై భాగంలో వచ్చే క్యాన్సర్‌లు (అప్పర్ జీఐ క్యాన్సర్‌లు) విపరీతంగా పెరిగాయి. ఇంతకు ముందు పాశ్చాత్య దేశాల్లో ఎక్కువగా కనిపించే ఈ సమస్యలు, ఇప్పుడు మన దేశంలో కార్బోనేటెడ్ డ్రింక్స్ వినియోగం పెరగడం వల్ల విస్తరిస్తున్నాయని వైద్య నిపుణులు, అధ్యయనాలు పేర్కొంటున్నాయి.. ఈ పానీయాల వల్ల ఎలాంటి ఉపయోగం లేకపోగా, దీర్ఘకాలంలో శరీరానికి, ముఖ్యంగా జీర్ణవ్యవస్థకు తీవ్రమైన హాని కలిగిస్తాయి. కొంతమంది చాతి నొప్పిని కూడా గ్యాస్ సమస్యగా పొరబడి, సోడా తాగితే తగ్గుతుందని భావిస్తారు. అయితే, చాతి నొప్పి కొన్నిసార్లు గుండె సంబంధిత సమస్యలకు సూచన కావచ్చు. అలాంటి కీలక సమయంలో సోడా తాగి ఆలస్యం చేయడం ప్రమాదకరం. సోడా లేదా గ్యాస్ డ్రింక్స్ ఎటువంటి చికిత్స కాదని గుర్తుంచుకోవాలి. ఇవి కేవలం తాత్కాలికంగా గ్యాస్‌ను బయటికి పంపించడంలో సహాయపడవచ్చు.. కానీ మూల కారణాన్ని పరిష్కరించలేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. . నెలలు లేదా సంవత్సరాల తరబడి వీటిని అలవాటు చేసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ. కనుక, ఇటువంటి పానీయాలను పూర్తిగా మానేయడం లేదా వీలైనంత వరకు తగ్గించడం ఆరోగ్యానికి చాలా మంచిదని పేర్కొంటున్నారు.

# పాదాల్లో ఆనెలు ఎందుకు వస్తాయి?



అయితే కొన్నిసార్లు చేతుల్లో కూడా ఏర్పడవచ్చు. చర్మంపై నిరంతరం ఒత్తిడి లేదా ఘర్షణ పడటం వల్ల రక్షణ కోసం చర్మం మందంగా మారడం దీనికి ప్రధాన కారణం. అధిక ఒత్తిడి: పాదాలపై ఏదైనా ఒక పాయింట్‌పై దీర్ఘకాలం పాటు అధిక ఒత్తిడి పడటం వల్ల చర్మం గట్టిపడుతుంది. నడిచేటప్పుడు పాదాలపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. చెప్పులు లేకుండా నడవడం: గరుకు ఉపరితలాలపై చెప్పులు లేకుండా నడవడం వల్ల పాదాలపై ఒత్తిడి పెరిగి,


పాదాల్లో ఆనెలు చర్మం గట్టిపడి గడ్డల్లా మారడం వల్ల ఏర్పడతాయి. ఎక్కువ ఒత్తిడి, చెప్పులు లేకుండా నడవడం, అధిక బరువు వంటివి ప్రధాన కారణాలు. ఆనెలను నివారించడానికి సరైన పాదరక్షలు, పాదాల పరిశుభ్రత ముఖ్యం. ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం వల్ల నొప్పిని తగ్గించి, సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. పాదాల్లో ఆనెలు (ఫుట్ కార్న్స్) గురించి వైద్య నిపుణులు అందిస్తున్న పూర్తి సమాచారాన్ని ఈ కథనంలో తెలుసుకుందాం. ఆనెలు చూడటానికి పెద్ద సమస్యలా అనిపించకపోయినా, అవి రోజువారీ కార్యకలాపాలకు, ముఖ్యంగా నడిచేటప్పుడు తీవ్రమైన అసౌకర్యాన్ని, నొప్పిని కలిగిస్తాయి. అసలు ఆనెలు అంటే ఏమిటి, అవి ఎందుకు వస్తాయి, వాటిని ఎలా గుర్తించాలి, చికిత్స.. నివారణ పద్ధతుల గురించి క్లియర్ కట్‌గా తెలుసుకుందాం.

ఆనెలు అంటే శరీరంలోని చర్మం గట్టిపడి, ఒక గడ్డలాగా ఏర్పడటం. ఇవి సాధారణంగా పాదాల్లో కనిపిస్తాయి,

ఆనెలు ఏర్పడతాయి. అధిక బరువు: అధిక బరువు ఉన్నవారి పాదాలపై ఎక్కువ భారం పడి, ఆనెలు రావడానికి దారితీస్తుంది. అబ్నార్మల్ గేట్ (నడిచే పద్ధతిలో లోపం): కొంతమందికి కాళ్ళలోని ఎముకల అమరిక సరిగా ఉండదు. దీని వల్ల నడిచేటప్పుడు పాదం ఒక వైపు అధిక ఒత్తిడికి గురై, ఆనెలు ఏర్పడతాయి. సరిగ్గా పాదం మొత్తం నేలపై ఆనించకుండా నడిచే వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. గట్టి చెప్పులు: గట్టి చెప్పులు లేదా సరిగా సరిపోని పాదరక్షలు ధరించడం వల్ల కూడా ఆనెలు వస్తాయి. వృత్తి సంబంధిత కారణాలు: ఎక్కువ బైక్ డ్రైవ్ చేసేవారు లేదా బరువైన వస్తువులను ఎత్తేవారి చేతుల్లో కూడా చర్మం గట్టిపడటం గమనించవచ్చు, ఇది ఆనెల ప్రారంభ రూపం. లక్షణాలు: ఆనెలు వస్తున్నాయని గుర్తించడానికి మొదటి లక్షణం చర్మం గట్టిపడటం. ఇది సాధారణంగా పాదాల్లోని బొటనవేలు కింద, ఎముకల ప్రామినెన్స్ వద్ద ఎక్కువగా కనిపిస్తుంది. చర్మం గట్టిపడటాన్ని నిర్లక్ష్యం చేస్తే, అది నొప్పిని కలిగించే ఆనెలుగా మారుతుంది. నడిచినప్పుడు నొప్పి రావడం సాధారణం. ఆనెలు రాకుండా నివారించడం లేదా ప్రారంభ దశలోనే వాటిని తగ్గించుకోవడం ముఖ్యం: ఒత్తిడి తగ్గించడం: చర్మం గట్టిపడటం మొదలైనప్పుడు, ఆ ప్రాంతంపై ఒత్తిడి పడకుండా జాగ్రత్త పడాలి. సరియైన పాదరక్షలు: మృదువైన, సౌకర్యవంతమైన చెప్పులు ధరించాలి. గట్టి లేదా బిగుతైన పాదరక్షలను నివారించాలి. పాదాల పరిశుభ్రత: పాదాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. మాయిశ్చరైజర్లు: చర్మం పొడిబారకుండా మాయిశ్చరైజర్‌లను ఉపయోగించి మృదువుగా ఉంచాలి. బరువు తగ్గడం: అధిక బరువు ఉన్నవారు బరువు తగ్గడం వల్ల పాదాలపై ఒత్తిడి తగ్గుతుంది. ఎముకల అసాధారణతలకు చికిత్స: కాళ్ళలోని ఎముకల అమరికలో ఏదైనా లోపాలు ఉంటే, వాటిని సరిచేయించుకోవడం వల్ల ఆనెలు ఏర్పడకుండా నివారించవచ్చు. చికిత్స: ఆనెలు ఏర్పడినట్లయితే నిపుణులైన వైద్యులు దానికి చికిత్స అందిస్తారు. ఆనెలు పూర్తిగా పెరిగినప్పుడు, ఆ గడ్డను సర్జికల్ పద్ధతిలో జాగ్రత్తగా కట్ చేసి తొలగిస్తారు. చికిత్స తర్వాత కూడా పాదాలను శుభ్రంగా ఉంచుకోవడం, మాయిశ్చరైజర్‌లు ఉపయోగించడం, మృదువైన పాదరక్షలు ధరించడం వంటి జాగ్రత్తలు పాటిస్తే ఆనెలు మళ్లీ రాకుండా చూసుకోవచ్చు. ఆనెలు కేవలం ఒక సౌందర్య సమస్య కాదని, సరైన సమయంలో చికిత్స చేయకపోతే నొప్పి, అసౌకర్యాన్ని కలిగిస్తుందని గుర్తించడం ముఖ్యం. నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా.. ప్రారంభ దశలోనే వైద్య సహాయం పొందడం ద్వారా ఈ సమస్యను సమర్థవంతంగా నిర్వహించవచ్చు.

# టీ20 వరల్డ్ కప్: కూనల పోరులో అమెరికా గెలిచింది!

### గ్రూప్-ఏ లో నెదర్లాండ్స్‌పై అమెరికా ఘన విజయం
### తొలుత బ్యాటింగ్ చేసి 196 పరుగులు చేసిన యూఎస్ఏ
### తెలుగు తేజం సాయితేజ అద్భుత అర్ధశతకం
### లక్ష్య ఛేదనలో 103 పరుగులకే కుప్పకూలిన డచ్ జట్టు
### 4 వికెట్లతో నెదర్లాండ్స్ పతనాన్ని శాసించిన హర్మీత్ సింగ్



టీ20 ప్రపంచకప్‌లో పసికూనల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో అమెరికా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం నాడు చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై 93 పరుగుల భారీ తేడాతో గెలిచి జయభేరి మోగించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన అమెరికా... డచ్ జట్టును చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో అన్ని రంగాల్లో విఫలమైన నెదర్లాండ్స్, అమెరికా ముందు తేలిపోయింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన నెదర్లాండ్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన అమెరికా జట్టు, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగుల భారీ స్కోరు సాధించింది. తెలుగు తేజం సాయితేజ ముక్కామల (51 బంతుల్లో 79) అద్భుత అర్ధశతకంతో జట్టుకు వెన్నెముకగా నిలిచాడు. క్రీజులో ఉన్నంతసేపు స్కోరు బోర్డును పరుగులు పెట్టించిన అతడి ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 4 సిక్సులు ఉన్నాయి. కెప్టెన్ మోనాంక్ పటేల్ (36) రాణించగా, చివర్లో శుభమ్ రంజనే (24 బంతుల్లో 48 నాటౌట్) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో అమెరికా భారీ స్కోరు చేయగలిగింది. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డి లీడ్ 3 వికెట్లు పడగొట్టినా, పరుగులు నియంత్రించడంలో విఫలమయ్యాడు. అనంతరం 197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ జట్టు, అమెరికా బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు నిలవలేకపోయింది. ఆది నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి, ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేదు. కేవలం 15.5 ఓవర్లలోనే 103 పరుగులకే కుప్పకూలింది. డచ్ జట్టులో బాస్ డి లీడ్ (23), స్కాట్ ఎడ్వర్డ్స్ (20) మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. అమెరికా బౌలర్లలో హర్మీత్ సింగ్ కేవలం 21 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి నెదర్లాండ్స్ పతనాన్ని శాసించాడు. అతడికి తోడుగా షాడ్లీ వాన్ షాల్క్‌విక్ 3 వికెట్లు, మహ్మద్ మోహ్సిన్ 2 వికెట్లతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

# టీ20 ప్రపంచకప్‌లో పెను సంచలనం ఆస్ట్రేలియాపై ఆఫ్రికా జట్టు అద్భుత విజయం



కొలంబో: ఐసీసీ టోర్నీలనగానే చెలరేగిపోయే ఆస్ట్రేలియాకు.. ఈసారి టీ20 ప్రపంచకప్ ఆరంభ దశలోనే భారీ షాక్ తగిలింది. శుక్రవారం గ్రూప్-బి మ్యాచ్‌లో జింబాబ్వే 23 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను మట్టికరిపించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లోనూ జింబాబ్వే.. కంగారూలపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం విశేషం. మొదట ఓపెనర్లు బ్రయాన్ బెనెట్ (64 నాటౌట్; 56 బంతుల్లో 7x4), మరుమాని (35; 21 బంతుల్లో 7x4)లతో పాటు ర్యాన్ బర్ల్ (35; 30 బంతుల్లో 4x4), సికందర్ రజా (25 నాటౌట్; 13 బంతుల్లో 2x4, 1x6) మెరుపులు మెరిపించడంతో జింబాబ్వే 2 వికెట్లకు 169 పరుగులు సాధించింది. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ముజరబాని (4/17), ఎవాన్స్ (3/23) విజృంభించడంతో ఆసీస్ 19.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. మ్యాట్ రెన్‌షా (65; 44 బంతుల్లో 5x4, 1x6) ఒంటరి పోరాటం చేశాడు.

**ముజరబాని 4/17**

దంచేసి.. కట్టేసి..: టోర్నీలో తన తొలి మ్యాచ్‌లో ఒమన్‌ను సునాయాసంగా ఓడించిన జింబాబ్వే.. రెండో మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆస్ట్రేలియా అనేమీ బెదరలేదు. ఇటు బ్యాటర్లు, అటు బౌలర్లు ఎంతో ఆత్మవిశ్వాసంతో ఆడి జట్టును గెలిపించారు. మొదట ఓపెనర్లు బ్రయాన్ బెనెట్, మరుమానిల బెదురులేని బ్యాటింగ్ చూస్తేనే ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు సవాలు తప్పదని అర్థమైంది. తొలి రెండు ఓవర్లు ఆచితూచి ఆడిన ఈ జోడీ.. తర్వాత దూకుడు పెంచడంతో 7 ఓవర్లకు జింబాబ్వే 57/0తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. తర్వాతి ఓవర్లో మరుమాని ఔటైనా.. బర్ల్‌తో కలిసి బెనెట్ మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పడంతో ఆ జట్టు 15 ఓవర్లకు 125/1తో భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. బర్ల్ వెనుదిరిగాక బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ సికందర్ రజా చెలరేగడంతో, బెనెట్ కూడా ఆఖర్లో భారీ షాట్లు ఆడడంతో జింబాబ్వే.. ఆసీస్ ముందు సవాలు విసిరే లక్ష్యాన్ని నిలిపింది. అనంతరం కంగారూల ఛేదన ఏ దశలోనూ సాఫీగా సాగలేదు. పేసర్లు ముజరబాని, ఎవాన్స్.. అద్భుతమైన ఆరంభ స్పెల్స్‌తో ఆస్ట్రేలియాను కోలుకోలేని దెబ్బ తీశారు. ఒక సిక్సర్ బాది ఊపుమీద కనిపించిన ఇంగ్లిస్ (8).. ముజరబాని బౌలింగ్‌లో ఇంకో భారీ షాట్‌కు ప్రయత్నించి, డీప్ స్క్వేర్ లెగ్‌లో మునికెవాకు దొరికిపోయాడు. ఎవాన్స్ వేసిన తర్వాతి ఓవర్లో గ్రీన్ (0) వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ వెంటనే డేవిడ్ కూడా డకౌటవడంతో ఆస్ట్రేలియాకు ఇంకో ఎదురుదెబ్బ తగిలింది. అయిదో ఓవర్లో (ముజరబాని) హెడ్ (17) ఔట్ కావడంతో ఆస్ట్రేలియాకు అతి పెద్ద షాక్. ఎడ్జ్ తీసుకున్న బంతి హెడ్ కాలికి తగిలి వికెట్లకు తాకడంతో అతను వెనుదిరగాల్సి వచ్చింది. 5 ఓవర్లకు 34/4కు చేరుకున్న ఆసీస్‌లో ఓటమి భయం మొదలైంది. మ్యాక్స్‌వెల్ (31), రెన్‌షా పోరాడడంతో కంగారూ జట్టు పుంజుకుంది. 12 ఓవర్లకు 105/4తో గెలుపు దిశగా సాగింది. రెండుసార్లు బౌండరీ వద్ద క్యాచ్‌ల ప్రమాదం తప్పించుకున్న మ్యాక్సీ.. బర్ల్ బౌలింగ్‌లో ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో బౌల్డవడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. తర్వాత వికెట్ల పతనం ఆగలేదు. బౌలింగ్ చేస్తూ గాయపడ్డ స్టాయినిస్ (6).. ఆ ఇబ్బందిలోనే ఒక పేలవ షాట్ ఆడి ఔటయ్యాడు. ద్వార్షుయిస్ (6).. మున్యోంగా పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరిగాడు. అయితే రెన్‌షా మాత్రం ఒక ఎండ్‌లో పోరాటం కొనసాగించాడు. చివరి 2 ఓవర్లలో 34 పరుగులు అవసరమైన స్థితిలో ఆసీస్ ఆశలన్నీ అతడి మీదే నిలిచాయి. అయితే 19వ ఓవర్లో గొప్పగా బౌలింగ్ చేసిన ముజరబాని.. రెన్‌షాతో పాటు జంపా (2)ను కూడా ఔట్ చేసి కంగారూల ఆశలకు తెరదించాడు. ఈ ఓవర్లో కేవలం 5 పరుగులే వచ్చాయి. చివరి ఓవర్ మూడో బంతికి కునెమన్ (0) రనౌటవడంతో ఆసీస్ కథ ముగిసింది.

# సెన్సార్ వివాదం విజయ్‌కి లాభమే చేసిందా?



ఈ మధ్య కోట్లు పెట్టినా రాని పబ్లిసిటీ ఒక్క వివాదంతో వచ్చేస్తోంది. అందుకే ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలోనూ, సినిమాల్లోనూ వైరల్ టాపిక్‌నే ఎంచుకుంటున్నారు.. వైరల్ అవుతున్నారు. తద్వారా ఫ్రీగానే పబ్లిసిటీని సొంతం చేసుకుంటూ వరల్డ్ వైడ్‌గా ఫేమస్ అవుతున్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే ట్రెండ్ నడుస్తోంది. కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ సినిమా -జన నాయగన్- విషయంలోనూ ఇదే ఫార్ములా ఆ సినిమాకు ప్లస్ అయింది అని చెప్పక తప్పదు. జనవరి 9న పొంగల్ బరిలో విడుదల కావాల్సిన ఈ సినిమా అర్ధాంతరంగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. సెన్సార్ వివాదం కారణంగా చివరి నిమిషంలో సినిమా రిలీజ్ ఆగిపోయింది. సీబీఎఫ్‌సీ వర్గాలు సినిమాలోని వివిధ సన్నివేశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం, కొన్ని డైలాగ్స్‌ని మ్యూట్ చేయాలని మేకర్స్‌కి సూచించడంతో వాటికి అంగీకరించని మేకర్స్ మద్రాస్ హైకోర్టుని ఆశ్రయించారు. ఇక్కడి నుంచే అసలు వివాదం మొదలై సినిమా థియేటర్లలోకి రావడం ఇక కష్టమనే ఊహాగాలు వైరల్ అయ్యేలా చేసింది. దీంతో సినిమా దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ రేంజ్ సినిమాకు పబ్లిసిటీ చేయాలంటే మేకర్స్ కోట్లు ఖర్చు చేయాలి.

కానీ సెన్సార్ వివాదం కారణంగా ఎలాంటి ఖర్చు లేకుండానే ఈ సినిమాకు దేశ వ్యాప్తంగా ఊహించని స్థాయి ఫ్రీ పబ్లిసిటీ లభించింది. పొంగల్ రిలీజ్ అయితే వారం రోజులు మాత్రమే హడావిడి ఉండేది. రిలీజ్ వాయిదా పడటం వల్ల జన నాయగన్ టీమ్‌కు మంచే జరిగిందని, సంక్రాంతి సినిమాల మధ్య రిలీజ్ అయితే ఆ స్థాయి బజ్ ఉండేది కాదని, రిలీజ్ పోస్ట్ పోన్ కావడమే మంచిది అయిందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. అంతే కాకుండా ఇప్పటికే బుక్ మై షోలో 1.1 మిలియన్‌ల వరకు ప్రేక్షకులు ఆసక్తిని చూపించారు. 4,50,000 టికెట్‌లు అడ్వాన్స్ బుకింగ్ అయ్యాయి. సినిమా రిలీజ్ వాయిదాపడటంతో అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న అందరికి భారీ మొత్తంలో డబ్బుని తిరిగి చెల్లించడం ఇండియన్ సినీ హిస్టరీలోనే ఫస్ట్ టైమ్ కావడంతో -జన నాయగన్- మరోసారి దేశ వ్యాప్తంగా వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలోనే ట్రేడ్ వర్గాలు ఓ ఆసక్తికరమైన లెక్కలని వేస్తున్నారు. రిలీజ్‌కు ముందే సంచలనం సృష్టించిన ఈ మూవీ రిలీజ్ తరువాత రికార్డు స్థాయి ఓపెనింగ్స్‌ని రాబట్టడం ఖాయం అని చెబుతున్నారు.

ఇదిలా ఉంటే గత నెల రోజులుగా రిలీజ్ విషయంలో సందిగ్ధత నెలకొన్న ఈ మూవీ టీమ్ తాజాగా ఓ ముందడుగు వేసింది. సీబీఎఫ్‌సీపై వేసిన కేసుని విత్‌డ్రా చేసుకున్నారు. దీన్ని మద్రాస్ హైకోర్టు ఆమోదించడంతో సినిమా రిలీజ్‌కు మార్గం సుగమం అయింది. ఇప్పటికే సెన్సార్ సభ్యులు సూచించిన మార్పులు చేసి టీమ్ రివైజింగ్ కమిటీకి పంపించారు. వారి నుంచి వచ్చే సమాధానం కోసం టీమ్ ఇప్పుడు ఆసక్తిగా ఎదురు చూస్తోంది. అంతా అనుకున్నట్టుగా జరిగితే సినిమా త్వరలోనే థియేటర్లలోకి రావడం ఖాయం.

### ఫ్యాషన్ ప్రియులు దేవయాని శర్మ శైలిని మిస్ చేయకూడదు



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com